
ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

రైతులకు రాజముద్ర

- జిల్లాకు చేరిన 49 వేల పట్టాదారు పాసు పుస్తకాలు
- రీసర్వే చేసి తన ఫొటోతో పుస్తకాలు పంపిణీ చేసిన జగన్
- వాటిని వెనక్కి తీసుకుని కొత్తవి ఇస్తున్న చంద్రబాబు



నమూనా పాసుపుస్తకాన్ని చూపిస్తున్న సీఎం చంద్రబాబు (ఫైల్‌ఫొటో)

చిత్తూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనా కాలంలో సచివాలయాల్లో ఇచ్చే జనన, మరణ వంటి ధ్రువపత్రాలపైనా తన ఫొటోను వేసుకున్న జగన్‌ రైతులను కూడా వదల్లేదు. రీసర్వే చేశాక పొలాల సరిహద్దులు చూపుతూ నాటే రాళ్ల మీద, రైతులకు అందించే పట్టాదారు పాసుపుస్తకాల మీద తన ఫొటోలు ముద్రించుకున్నారు. ఆ పుస్తకాలను రద్దు చేసి రాజముద్రతో కొత్త పుస్తకాలను అందిస్తామని సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. గతేడాది జూలైలో జగన్‌ ఫొటోలతో ఉన్న పుస్తకాలను వెనక్కి తీసుకోగా, తాజాగా వాటి స్థానంలో కొత్త పుస్తకాలను అందించనున్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో శాశ్వత భూహక్కు-భూరక్ష పథకం కింద చేపట్టిన భూ రీసర్వేపై జిల్లాలో పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. సర్వేలో లోపాలున్నాయని, రీ సర్వేతో తమ భూమి తగ్గిపోయిందని అనేక మంది రైతులు గగ్గోలు పెట్టారు. అయినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. భూహక్కు పత్రంపై పెద్దదిగా జగన్‌ ఫొటో ఉండడంపైనా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ క్రమంలో ఎన్నికల సమయంలో చంద్రబాబు అనేక ప్రచార సభల్లో జగన్‌ ఫొటో ఉన్న పాసు పుస్తకాల్ని రద్దు చేసి రాజముద్రతో మళ్లీ కొత్త పుస్తకాల్ని పంపిణీ చేస్తానని మాటిచ్చారు. పుంగనూరు రోడ్‌షోలో జగన్‌ ఫొటోతో ఉన్న పుస్తకాన్ని చించి పడేశారు. అనుకున్నట్టే కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సీఎం చంద్రబాబు గతేడాది జూలైలో జగన్‌ ఫొటోలతో ఉన్న పాసుపుస్తకాలను వెనక్కి తీసుకోవాలని ఆదేశించారు. వాటి స్థానంలో కొత్త పుస్తకాలను అందించాలని గతేడాది ఆగస్టు 7న జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.



జగన్‌ ఫొటోతో ఉన్న పాత పాసుపుస్తకం

'వైఎస్సార్‌ జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష' కార్యక్రమానికి చిత్తూరు జిల్లాలోని గుడిపాల మండలం ముత్తుకూరుపల్లెను పైలట్‌ ప్రాజెక్టుగా ఎంపిక చేసి సర్వే ప్రారంభించారు. మూడు విడతల్లో భూ రీసర్వే చేయగా.. మొత్తం 329 గ్రామాల్లో 90,287 పుస్తకాల్ని పంపిణీ చేశారు. గతేడాది జూలైలో రెవెన్యూ అధికారులు వాటిని వెనక్కి తీసుకున్నారు. ఇప్పుడు రాజముద్రతో కూడిన 49 వేల పాసుపుస్తకాలు జిల్లాకు వచ్చాయి. 30 పుస్తకాలు ఓ సెట్టుగా ఉన్న వీటిని అధికారులు పరిశీలిస్తున్నారు. అన్నీ సరిచూసి మండలాలకు పంపించి, ఆగస్టు 15 నుంచి పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

నత్తనడకన ఎన్‌హెచ్‌ పనులు

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా...? ● హైవే అధికారులపై కలెక్టర్‌, ఎస్పీ ఆగ్రహం





నంగమంగళం రైల్వే గేటు వద్ద పనులు పరిశీలిస్తున్న కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌ - 190రామాపురం సీఎంసీ వద్ద ఎటువంటి సూచిక బోర్డులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్‌, ఎస్పీ

గుడిపాల, జూలై 23(ఆంధ్రజ్యోతి): బెంగళూరు-చెన్నై జాతీయరహదారి పనులు నత్తక నడకన జరుగుతుండటంతో కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌, ఎస్పీ మణికంఠ హైవే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంసీఆర్‌ క్రాస్‌ ఫ్లైవోవర్‌ వద్ద బుధవారం జాతీయ రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంసీఆర్‌ క్రాస్‌ ఫ్లైవోవర్‌, నంగమంగళం ఫ్లైవోవర్‌ ప్రాంతాల్లో వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనుకున్న సమయానికి పూర్తిచేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం 190రామాపురం సీఎంసీ ఫ్లైవోవర్‌ వద్ద రేడియం స్టిక్కర్లు, లైటింగ్‌, జీబ్రా క్రాసింగ్‌ లైన్లు, హెచ్చరిక బోర్డులుఏర్పాటు చేయకపోవడంపై సీఎంసీ అధికారులు,ఎస్డీ కన్‌స్ట్రక్షన్‌పై తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గుడిపాల ఎస్‌ఐ రామ్‌మోహన్‌ మంగళవారం జరిగిన క్రైం మీటింగ్‌లో ఈ విషయాలను కలెక్టర్‌, ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. హైవే అధికారుల నిర్లక్ష్యం వలన నంగమంగళం రైల్వే గేటు వద్ద 14 మంది మృతి చెందగా, 46 మంది తీవ్రంగా గాయపడ్డారని తెలపడంతో బుధవారం కలెక్టర్‌, ఎస్పీ సందర్శించారు.

అగ్రిగోల్డ్‌ ఆస్తుల రక్షణకు జిల్లా కమిటీ

చిత్తూరు కలెక్టరేట్‌, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అగ్రిగోల్డ్‌ ఆస్తుల పరిరక్షణకు జిల్లాకమిటీని ఏర్పాటు చేస్తూ కలెక్టర్‌ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. కమిటీకి కలెక్టర్‌, జేసీ చైర్మన్‌గా, జిల్లా రిజిస్ట్రార్‌, డీపీఆర్వో, డిస్ట్రిక్‌ ఐటీ ఆఫీసర్‌, తిరుపతి సీఐడీ ఆఫీసర్‌, ఆర్వో ఆఫీసర్‌, చిత్తూరు, పలమనేరు మున్సిపల్‌ కమిషనర్లు, ఐరాల, వి.కోట తహసీల్దార్‌ల ను సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులుజారీచేశారు.

10 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్‌, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం కారణంగా గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 10 మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మండలాలవారీగా వి.కోటలో 9.0, పలమనేరులో 8.2, శాంతిపురంలో 8.0, రామకుప్పంలో 6.2, కార్వేటినగరంలో 6.2, గంగవరంలో 5.4, యాదమరిలో 4.6, పుంగనూరులో 3.2, గుడుపల్లిలో 2.4, చిత్తూరు అర్బన్‌లో 1.0 మి.మీ వర్షపాతం నమోదయ్యింది.


'అక్షర ఆంధ్ర' అమలుకు పలు కమిటీల ఏర్పాటు

చిత్తూరు కలెక్టరేట్‌, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా అక్షర ఆంధ్ర పేరిట ఉల్లాస్‌ పథకం అమలు, స్వచ్ఛంద ఉపాధ్యాయుల నియామకం, తరగతుల నిర్వహణకు సంబంధించి జిల్లా, మండల, పట్టణస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తూ కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాస్థాయి కమిటీలో చైర్మన్‌గా కలెక్టర్‌, సభ్యులుగా జడ్పీ సీఈవో, డీఆర్‌డీఏ పీడీ, మెప్మా పీడీ, మహిళా, శిశు సంక్షేమశాఖ పీడీ, డీపీవో, డీఈవో, డీపీఆర్వో, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్‌ అధికారులు ఉంటారు. కోఆర్డినేటర్‌గా వయోజన విద్యాశాఖ అధికారి ఉంటారు. మండలస్థాయి కమిటీ చైర్మన్‌గా ఎంపీడీవో, సభ్యులుగా డీఆర్డీఏ ఏపీడీ, మహిళా, శిశు సంక్షేమశాఖ సీడీపీవో, ఎంఈవోలు ఉంటారు. కోఆర్డినేటర్‌గా వయోజనవిద్య శాఖ అసిస్టెంట్‌ ప్రాజెక్ట్‌ అధికారి వ్యవహరిస్తారు. పట్టణస్థాయి కమిటీకి ఆయా మున్సిపల్‌ కమిషనర్లు చైర్మన్‌గా, కోఆర్డినేటర్లుగా సిటీమిషన్‌ మేనేజర్‌, సీడీపీవో, ఎంఈవో, వయోజన విద్యశాఖ అసిస్టెంట్‌ ప్రాజెక్ట్‌ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు.



టమోటా పంటకు వాన దెబ్బ ..!

● ధరలున్నా కాయలు దెబ్బతినడంతో ఆందోళనలో రైతాంగం



సోమలలో వర్షంతో దెబ్బతిన్న టమోటా తోట

సోమల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు టమోటా తోటలు బాగా దెబ్బతిన్నాయి. లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి సాగు చేస్తే వర్షం ప్రభావంతో కోతలు చేయకుండానే దెబ్బతిన్నాయి.సోమల మండలంలోనే దాదాపు 400 ఎకరాల్లో ఏప్రిల్‌, మే నెలల్లో నాటిన టమోటా రైతులు నష్టపోయారు.ఇన్నాళ్లూ టమోటా ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.ఇప్పుడు వర్షం దెబ్బతో పచ్చని తోటల్లో ఆకులు రాలిపోతున్నాయి. చీడపీడలు వ్యాప్తి చెంది కాయలపై నల్లని మచ్చలు, పగుళ్లు రావడంతో పండిన పంటను మార్కెట్‌కు తరలించలేక పొలాల వద్దే వదిలేస్తున్నారు.మూడు రోజులుగా టమోటా ధరలు పెరిగి 15 కిలోల బాక్సు ధర 600 రూపాయలకు చేరుకుంది. అయితే తోటల్లో ఉన్న పంటను మార్కెట్‌కు తరలిస్తే నాణ్యత లేని కాయలు కావడంతో రూ.100 లోపు ధర పలుకుతోంది. పుంగనూరు, పలమనేరు మార్కెట్‌కు రవాణా ఖర్చులే బాక్సుకు రూ.20 చెల్లించాలి. కమీషన్‌ 10శాతం వసూలు చేస్తారు. ఈ ధరకు పెట్టుబడి సైతం దక్కదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టమోటా సాగుకు ఎకరానికి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. స్థిరమైన ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికి తోడు వర్షంతో దెబ్బతిన్న పంటకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందే పరిస్థితి లేదని తెలిసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానశాఖ అధికారులు స్పందించి టమోటా పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అరెస్టుల్లేవు....రికవరీ లేదు

రూ.1.36 కోట్ల దుర్వినియోగం కేసుపై పలు అనుమానాలున్నాయ్‌ - జడ్పీ డిప్యూటీ సీఈవో

పుంగనూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఎంపీడీవో కార్యాలయానికి సంబంధించిన ప్రభుత్వ నిధులు రూ.1.36 కోట్ల దుర్వినియోగంపై జడ్పీ సీఈవో వెంకటనారాయణ విచారణ చేపట్టారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులు పరిశీలించి, నిధులు దుర్వినియోగం కావడానికి బాధ్యులైన అధికారులను ఆయన విచారించి సమగ్ర విచారణ కోసం రికార్డులు తీసుకెళ్లారు.పుంగనూరు ఎంపీడీవో కార్యాలయంలో నిధుల స్వాహా గురించి గత ఏడాది జూన్‌ 20న 'అమ్మో..కాంట్రాక్టు ఉద్యోగి' శీర్షికన ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే.ఆన్‌లైన్‌ బెట్టింగులతో అప్పులపాలైన కంప్యూటర్‌ ఆపరేటర్‌ సునీల్‌ వాటిని తీర్చేందుకు ఎంపీడీవో లాగిన్‌ ఓపెన్‌ చేసి ప్రభుత్వ నిధులను సొంత ఖాతాలోకి మళ్లించుకున్న ఈ విషయం అప్పట్లో సంచలనం సృష్టించింది.జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకట నారాయణ మీడియాతో మాట్లాడుతూ 2023 ఏప్రిల్‌ నుంచి 2024 జనవరి వరకు 9 నెలల్లో పుంగనూరు ఎంపీడీవో కార్యాలయంలో రూ.1.36 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగిందన్నారు. దీనిపై గతంలో డీఎల్‌డీవో వెంకటశేషయ్య విచారణ చేపట్టి తుదిదశలో బదిలీ కావడంతో ఆ బాధ్యతను జడ్పీ సీఈవో తనకు అప్పగించారని చెప్పారు. మాజీ ఎంపీడీవో రాజేశ్వరమ్మను, సీనియర్‌ అసిస్టెంట్‌ రాజశేఖర రెడ్డిని విచారించానని, టైపిస్టును, ఈవోపీఆర్డీని విచారించాల్సి ఉందని తెలిపారు. కాంట్రాక్ట్‌ పద్ధతిన పనిచేసిన కంప్యూటరు ఆపరేటర్‌ సునీల్‌ తమను మోసగించి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని వారు తెలిపారన్నారు. కానీ సూపర్‌వైజరీ బాధ్యతల్లో ఉన్న అధికారులు బాధ్యతలు విస్మరించి కాంట్రాక్టు ఉద్యోగికి ప్రభుత్వ లాగిన్‌ వివరాలు తెలియజేయడం తప్పు అని తెలిపారు. గతంలో ఎంపీడీవో వెంకటమునిరెడ్డి ఈ నిధుల దుర్వినియోగంపై పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టగా ఎఫ్‌ఐఆర్‌ నమోదైనా ఇప్పటి వరకు అరెస్టులు జరక్కపోవడం, నిధుల రికవరీ కాకపోవడంపై అనుమానంగా ఉందని తెలిపారు. ఏ స్థాయిలో తప్పు జరిగింది, బాధ్యులు ఎవరు తదితర విషయాల్లో సమగ్ర విచారణ కోసం సంబంధిత రికార్డులను స్వాధీనం చేసుకుని చిత్తూరు తీసుకెళ్లి పరిశీలించి పూర్తి స్థాయి నివేదిక జడ్పీ సీఈవోకు సమర్పిస్తానని ఆయన వివరించారు.



పుంగనూరు ఎంపీడీవో కార్యాలయంలో వెంకటనారాయణ

గుర్తుండిపోయేలా మహిళా సాధికారిత సదస్సు

హాజరుకానున్న 300మందికి పైగా ప్రజాప్రతినిధులు ● ఏర్పాట్లు పక్కాగా ఉండాలంటూ అధికారులకు స్పీకర్‌ ఆదేశాలు

తిరుపతి(కలెక్టరేట్‌), జూలై 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని తాజ్‌హోటల్‌లో సెప్టెంబరు 14, 15 తేదీల్లో జాతీయ మహిళా సాధికారిత సదస్సు (చట్టసభల జాతీయ మహిళా సాధికార సభ్యుల సదస్సు) నిర్వహిస్తున్నట్లు అసెంబ్లీ స్పీకర్‌ చింతకాయల అయ్యన్నపాత్రుడు చెప్పారు. తిరుపతి కలెక్టరేట్‌లో బుధవారం డిప్యూటీ స్పీకర్‌ రఘురామకృష్ణంరాజు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి సదస్సు నిర్వహణపై జిల్లా యంత్రాంగంతో సమీక్షించారు. దేశంలోని 31 అసెంబ్లీలలో మహిళా కమిటీలు ఉన్నాయన్నారు. ఈ కమిటీల ద్వారా అనేక సమస్యలపై చర్చలు జరుగుతుంటాయని తెలిపారు. ప్రతి సమస్యను స్పీకర్‌, డిప్యూటీ స్పీకర్‌ పరిష్కరించాలంటే కష్టమైన పనని, అందుకోసమే ఇలాంటి సదస్సులు నిర్వహించి అందులో చర్చా విధానాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. ఈ నేపథ్యంలోనే చట్టసభల జాతీయ మహిళా సాధికారిత సభ్యుల సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తొలుత విశాఖలో నిర్వహించాలని అనుకున్నా- శ్రీవారు కొలువైన తిరుపతిలో నిర్వహించాలని పార్లమెంట్‌ స్పీకర్‌ ఓంబిర్లా సూచించారన్నారు. ఎప్పటికీ గుర్తుండిపోయేలా సెప్టెంబరు 14, 15 తేదీలలో తిరుపతిలో పార్లమెంటరీ, లెజిస్లేటివ్‌ కమిటీ ఆన్‌ ఎన్‌పవర్‌ ఆఫ్‌ ఉమెన్స్‌ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీకి ప్రతి రాష్ట్రం నుంచి ఆరుగురు.. ప్రతి అసెంబ్లీ నుంచీ ఆరుగురు చొప్పున మహిళా ప్రజాప్రతినిధులు తాజ్‌ హోటల్‌లో జరిగే ఈ సదస్సుకు హాజరవుతారన్నారు. ఇలా 300మందికిపైగా హాజరయ్యే సభ్యులు రెండు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి ఆ నివేదికను పార్లమెంటు, అసెంబ్లీ ద్వారా తీసుకెళ్తారని అయ్యన్నపాత్రుడు తెలిపారు. 'సదస్సు అనంతరం తిరుమల, శ్రీకాళహస్తి, శ్రీసిటీ, శ్రీహరికోట, చంద్రగిరి కోటను సభ్యులు సందర్శిస్తారు. క్షేత్రస్థాయి పరిశీలన చేస్తారు. సదస్సు, వీరి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి' అని సూచించారు.



స్పీకర్‌ను సత్కరించి జ్ఞాపిక బహూకరిస్తున్న కలెక్టర్‌

మహిళాభ్యున్నతికి సీఎం కృషి : సీఎం చంద్రబాబునాయుడు మహిళాభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని డిప్యూటీ స్పీకర్‌ రఘురామకృష్ణంరాజు తెలిపారు. ఎక్కడా లేనివిధంగా చట్టసభల్లో, పదవుల కేటాయింపులో మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. తిరిగి 15 రోజుల తర్వాత మళ్లీ సమీక్షిస్తామన్నారు. వచ్చే కమిటీ సభ్యులకు బస, వసతి ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని మంత్రి అనగాని సత్యప్రసాద్‌ ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో టీటీడీ చైర్మన్‌ బీఆర్‌నాయుడు, ఈవో శ్యామలరావు, కలెక్టర్‌ వెంకటేశ్వర్‌, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, నెలవల విజయశ్రీ, ఆదిమూలం, రామకృష్ణ, శాప్‌ చైర్మన్‌ రవినాయుడు, తుడా చైర్మన్‌ డాలర్స్‌ దివాకర్‌రెడ్డి, జేసీ శుభం బన్సల్‌, డీఆర్వో నరసింహులు, కమిషనరు మౌర్య, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు నరసింహయాదవ్‌, సుగుణమ్మ, సదాశివం, హరిప్రసాద్‌, టీడీపీ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్‌ శ్రీధర్‌ వర్మ తదితరులు పాల్గొన్నారు.





అయ్యన్నపాత్రుడు - రఘురామకృష్ణ రాజు, గురజాల జగన్మోహన్ - డ్రమ్స్ శివమణి

తిరుమలలో ప్రముఖులు

తిరుమల, జూలై23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం, బీజేపీ నేత అశోక్, డ్రమ్స్ కళాకారుడు శివమణి, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, తెలంగాణ ఎమ్మెల్సీ ఎల్ రమణ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు మీడియాతో మాట్లాడుతూ, ఎంతో నష్టపోయిన రాష్ట్రం ఇప్పుడిప్పుడే అభివృద్ధివైపు అడుగులేస్తోందని అన్నారు. అభివృద్ధిలో అందరం భాగం కావాలని పిలుపునిచ్చారు.

పవన్ సినిమా మాకో పెద్ద పండుగ


● తెలంగాణ టీఎఫ్‌సీసీ కార్యదర్శి శ్రీధర్



టీఎఫ్‌సీసీ సెక్రటరీ శ్రీధర్, నిర్మాత సునీల్ నారంగ్

తిరుమల, జూలై23(ఆంధ్రజ్యోతి): 'దేవుడి దయతో చాలా రోజుల తర్వాత పవన్‌కల్యాణ్ పెద్ద సినిమా 'హరిహర వీరమల్లు' వస్తోంది. మాకో పెద్ద పండుగలా ఉంది. రేపటి నుంచి దీపావళి మొదలవుతుంది' అని తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ జనరల్ సెక్రటరీ శ్రీధర్ అన్నారు. నిర్మాత సునీల్ నారంగ్‌తో కలిసి బుధవారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, ఈ చిత్రం పెద్ద హిట్ కావాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని ఆరు షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.42 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 79,467

తలనీలాలు సమర్పించినవారు: 28,642



లక్ష్మీవరాహస్వామి



నాలుగు సింహాలు



శంఖునిధి



పద్మతినిధి



వ్యాసమహర్షి



సంధ్యాతాండవం శివుడు



మురళీకృష్ణుడు



బయట ప్రధాన గేటు వద్ద శంఖు చక్రం, నామం



అష్టలక్ష్ములు, శ్రీపద్మావతి అమ్మవారు



సీఎంకు బహూకరించే శ్రీనివాసకల్యాణం ప్రతిమ

శయనమూర్తి

సరస్వతీదేవి, లక్ష్మీదేవి



కాళీయమర్ధనుడు

కళ్లు చెదిరే కళాకృతులు

● శిక్షణ దశలోనే విద్యార్థుల నైపుణ్య ప్రతీకలు

మనసును కట్టిపడేసే ఈ శిల్పాలను చూస్తే చేయి తిరిగిన శిల్పి ఎవరో చెక్కారేమో అనిపిస్తుంది. కానేకాదు. అవి శిల్పకళలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు తీర్చిదిద్దిన కళాకృతులంటే ఆశ్చర్యం కలుగుతుంది. తిరుపతిలోని టీటీడీ శిల్పకళాశాలలో నాలుగో ఏడాది (చివరి) విద్యార్థుల చేతిలో కళ్లు చెదిరే ఈ కళారూపాలు రూపుదిద్దుకున్నాయి. శిల, సుధా, దారు, లోహ విభాగాల్లో వివిధ రూపాలను చెక్కి అబ్బురపరిచారు. గోవిందరాజ సత్రాలను కూల్చే సమయంలో లభించిన టేకుతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు, అష్టలక్ష్ములతో కూడిన పద్మావతి అమ్మవారు, ప్రస్తుతం కాళీయమర్ధనంలాంటి శిల్పాలు ముచ్చట గొలుపుతున్నాయి. శిక్షణ పూర్తయ్యాక వెళ్లే క్రమంలో విద్యార్థులు ఇలా మనోహర శిల్పాలతో తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. కళాశాల ప్రాంగణంలో వీటిని కొలువుదీర్చి ప్రత్యేక వన్నె తెచ్చారు. తామెప్పుడైనా కళాశాలకు వస్తే ఈ శిల్పాలు మధురానుభూతిని కలిగిస్తాయని విద్యార్థులు చెప్పారు. కొందరు ఆక్రాలిక్‌షీట్, క్యాన్వాస్‌లపై దేవతామూర్తుల పెయింటింగ్‌లను కూడా వేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి



దశావతరాలు - వరసిద్ధివినాయకుడి లోహవిగ్రహం







టేకు కొయ్యతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు - శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠనారాయణమూర్తి - సిమెంట్‌తో చేసిన లతాంగులు, నాట్యగత్తెలు

● టీటీడీ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు

25, 26 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 25, 26 తేదీల్లో ఉదయం 8 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. టీటీడీలో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్ ఉద్యోగుల పిల్లలు, బాల మందిర్ పిల్లలు, సీటు వచ్చి వివిధ కారణాలతో మూడు విడతలలో కౌన్సెలింగ్‌కు హాజరుకానివారికి, స్థానిక విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుంది. ధ్రువీకరణ పత్రాలు, ఫీజులతో నేరుగా సంబంధిత జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావొచ్చు.

ఏరియా ఆస్పత్రుల్లో ట్రైబల్ సెల్

● ఏర్పాటు చేయాలంటూ ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్రావు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 23(ఆంధ్రజ్యోతి): ఏరియా ఆస్పత్రుల్లో ట్రైబల్ సెల్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావు ఆదేశించారు. తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం ఆయన జిల్లా అధికారులతో సమీక్షించారు. మైదాన ప్రాంతాల్లో ఎక్కువగా నివసించే గిరిజనులపై అధికారులు దృష్టిపెట్టి, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. సంక్షేమ పథకాలపై వారికి అవగాహన కల్పించి, లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. గిరిజనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని పోలీసుశాఖను ఆదేశించారు.అటవీ ఉత్పత్తుల సేకరణకుగాను గుర్తింపు కార్డులు జారీ చేయాలని అటవీశాఖకు సూచించారు. గిరిజన సంక్షేమ హాస్టళ్లను ప్రతి 15రోజులకు ఒకసారి వైద్యులు సందర్శించి వైద్యసాయం అందించాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఎస్టీలకు సంబంధించి రోస్టర్ అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విక్రమ్, డిప్యూటీ ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మృణాళిని తదితర అధికారులు పాల్గొన్నారు.

చంద్రగిరి కోటలో స్పీకర్



చంద్రగిరి కోటను సందర్శిస్తున్న స్పీకర్, తుడా చైర్మన్

చంద్రగిరి, జూలై 23(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి కోటను బుధవారం అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సందర్శించారు. సెప్టెంబరు 14, 15 తేదీల్లో జరిగే జాతీయ మహిళా సాధికారిత సదస్సులో పాల్గొనే కమిటీ సభ్యులు తర్వాత చారిత్రాత్మకమైన చంద్రగిరి కోటను సందర్శించనున్నారు. ఈ క్రమంలో తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, జిల్లా టూరిజం అధికారి జనార్దన్‌రెడ్డి, ఆర్డీవో రామ్మోహన్, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, లైటింగ్ షో మేనేజర్ మోహన్ తదితరులతో కలిసి స్పీకర్ కోటను పరిశీలించారు. చంద్రగిరి కోట ప్రాశస్త్యాన్ని తెలిపేలా మ్యూజికల్ లైట్‌షో ఏర్పాటు చేస్తామన్నారు. ఆ రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విందు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

మత్తు ఇంజక్షన్ వేసుకుంటూ..!

● డ్రోన్‌కు చిక్కిన నలుగురు యువకులు

● కౌన్సెలింగ్ ఇచ్చి తల్లితండ్రులకు అప్పగించిన పోలీసులు



తిరుపతి(నేరవిభాగం), జూలై 23(ఆంధ్రజ్యోతి): చెట్ల పొదల్లో మనల్ని ఎవరు చూస్తారులే అనుకున్నారు. మత్తు ఇంజక్షన్లు వేసుకుంటూ.. మత్తులో మునిగి తేలుతున్నారు. ఇలా తిరుపతి రూరల్ మండలం లింగేశ్వర నగర్‌లో బుధవారం మత్తు ఇంజక్షన్లు వాడుతున్న నలుగురు యువకులను డ్రోన్ కెమెరాతో నిఘా వుంచి పోలీసులు పట్టుకున్నారు. ఇలాంటి వారిని పట్టుకునేందుకు రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు. అలా నిఘా ఉంచిన డ్రోన్ కెమెరాకు.. లింగేశ్వరనగర్‌లోని మారుమూల ప్రాంతంలో పొదల మధ్య మత్తు ఇంజెక్షన్లు తీసుకుంటూ నలుగురు యువకులు చిక్కారు. ఎస్పీ నేతృత్వంలోని ఈగల్ టీమ్‌లు, డ్రోన్ కెమెరాల సిబ్బంది గుర్తించారు. వారిని పట్టుకుని తిరుపతి రూరల్ పోలీసులకు అప్పగించారు. రూరల్ సీఐ చిన్నగోవిందు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. యుక్త వయస్సులో ఇలా చెడు అలవాట్లకు బానిసలుగా మారితే భవిష్యత్ మొత్తం సర్వ నాశనం అవుతుందని హితవు పలికారు. వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించారు. తల్లిదండ్రుల అనుమతితో వారిని వైద్యుల సూచనల మేరకు రీహాబిలటేషన్ కేంద్రానికి పంపి కౌన్సెలింగ్ ఇప్పిస్తామని చెప్పారు.



బర్డ్ ఆస్పత్రిపై సమీక్షిస్తున్న టీటీడీ చైర్మన్, ఈవో

బర్డ్‌లో అలస్యం లేకుండా

సర్జరీలను పూర్తి చేయండి

● టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సూచన

తిరుపతి(వైద్యం), జూలై 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని బర్డ్ (బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ రిహాబిలిటేషన్ ఫర్ ద డిజేబుల్)కు వచ్చే రోగులు సర్జరీల కోసం ఎదురు చూడకుండా.. ఆ సమయాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని వైద్యాధికారులకు టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు సూచించారు. తిరుపతిలోని శ్రీపద్మావతి అతిథి గృహంలో బుధవారం ఆయన టీటీడీ ఈవో శ్యామలరావుతో కలిసి బర్డ్ అధికారులతో సమీక్షించారు. అవసరమైన వైద్య పరికరాలు, మందులు, వైద్యులను, సిబ్బందిని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కీళ్ల మార్పిడి తదితర శస్త్ర చికిత్సలకు అవసరమైన విదేశీ పరికరాలను మరింత నాణ్యమైన వాటిని ఎంపిక చేసుకొని మన ధరలకు అనుగుణంగా సేకరించాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చక్కటి గుర్తింపు ఉన్న బర్డ్‌ను గత కొంతకాలంగా నిర్వీర్యం చేయడం బాధాకరమన్నారు. తిరిగి బర్డ్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బర్డ్‌పై నమ్మకంతో వచ్చే రోగుల నమ్మకాన్ని నిలబెట్టేలా వైద్య సేవలు అందించాలని సూచించారు. 'శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలలో చిన్నపిల్లల గుండె శస్త్ర చికిత్సలకు దాతలు విరాళాలు ఇచ్చే అపన్న హృదయ పథకం ఉంది. బర్డ్‌లోనూ అర్హులైన నిరుపేదలకు శస్త్ర చికిత్సలు చేసేందుకు దాతల నుంచి విరాళాలు సేకరించే అంశంపై సంబంధిత అధికారులు సంయుక్తగా నివేదిక తయారు చేయాలి' అని ఈవో శ్యామలరావు పేర్కొన్నారు. అధునాతన వైద్య పరికరాలను నిబంధనల మేరకు కొనుగోలు చేయాలన్నారు. దివ్యాంగ పిల్లలకు తక్షణమే సర్జరీలను చేస్తున్నామని బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ చెప్పారు. జాయింట్ రీప్లేస్మెంట్‌లకు మాత్రమే ఏడాది సమయం పడుతోందన్నారు. అనంతరం బర్డ్ ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలు, అభివృద్ధి పనులను ఆయన పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యుడు నన్నపనేని సదాశివరావు, జేఈవో వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

భవనాల నాణ్యతలో రాజీ వద్దు

స్విమ్స్ ఆవరణలో నిర్మిస్తున్న భవనాల నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా చూడాలని అధికారులను టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు ఆదేశించారు. స్విమ్స్‌లో నిర్మిస్తున్న పలు విభాగాలకు సంబంధించిన భవనాలను బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను, వైద్య పరికరాలను, సిబ్బందిని త్వరితగతిన పూర్తి చేసి రోగులకు ఇబ్బందులు లేకుండా వైద్యసేవలు అందించాలన్నారు. స్విమ్స్ అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యులు సుచిత్ర ఎల్లా, సదాశివరావు, జేఈవో వీరబ్రహ్మం, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, సీఈ సత్యనారాయణ, ఎస్ఈలు మనోహర్, వెంకటేశ్వర్లు, ఎంఎస్ డాక్టర్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

● వరదయ్యపాళెంలో నలుగురు, పనపాకంలో ఇద్దరు

● 20 దుంగలు స్వాధీనం

సత్యవేడు/మంగళం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెండు చోట్ల మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం జరిపిన తనిఖీల్లో ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లు పట్టుబడ్డారు. మొత్తం 20 దుంగలు, మూడు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. వరదయ్యపాళెం ఆర్టీసీ బస్టాండు వద్ద ఎస్ఐ మల్లికార్జున, సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. శ్రీకాళహస్తి నుంచి వచ్చిన కారు, మినీ వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా 11 ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. వాహనాల్లోని లంక వినోద్, కృష్ణ, పెంచలయ్య, అనిల్‌ను అదుపులో తీసుకున్నారు. దుంగలు, రెండు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి.. నలుగురు స్మగ్లర్లపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపామని ఎస్ఐ తెలిపారు.

పనపాకం వద్ద టాస్క్‌ఫోర్సు తనిఖీలు



పట్టుబడ్డ స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

చంద్రగిరి మండలం పనపాకం సమీపం సి.మల్లవరం క్రాస్ వద్ద జాతీయ రహదారిపై మంగవారం రాత్రి తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐ నరేష్ బృందం తనిఖీలు చేపట్టారు. కాస్త దూరంలో ఓ లారీ పక్కకు ఆగింది. అందులో నుంచి ఇద్దరు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించగా.. పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వీరు కర్ణాటకకు చెందిన వారని గుర్తించారు. లారీలో తనిఖీ చేయగా తొమ్మిది ఎర్రచందనం దుంగలు లభించాయి. దుంగల సహా లారీని, స్మగ్లర్లను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తీసుకొస్తున్న ఇద్దరి అరెస్టు

● నాలుగు కిలోలు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జూలై 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం భూమయ్యగారి పల్లికి చెందిన గూలూరు చంద్రమోహన్, అదే ప్రాంతానికి చెందిన ఇరసపల్లి అరుణ్‌కుమార్ స్నేహితులు. సులభ సంపాదనకు అలవాటు పడ్డారు. తెలిసిన వారి ద్వారా గంజాయి తీసుకొచ్చి తిరుపతిలో విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో భద్రాచలం వెళ్లారు. శ్రీకాకుళం నుంచి మనోహర్ గంజాయి తీసుకొచ్చి భద్రాచలంలో భారీగా విక్రయిస్తుంటాడు. అతడి వద్ద వీరు రూ.80 వేలకు నాలుగు కిలోల గంజాయి కొన్నారు. రైలులో దిగి తిరుచానూరు రోడ్డు వైపు నడుచుకుంటూ వెళ్తున్నారు. దీనిపై ఈస్ట్ సీఐ శ్రీనివాసులకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది కలిసి వారిని పట్టుకున్నారు. వారి నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి ప్రధాన నిందితుడు మనోహర్ కోసం ప్రత్యేక బృందాలను నియమించారు.

5లక్షల జనాభా.. రోజూ లక్షమంది యాత్రికుల తాకిడి ఉండే నగరం తిరుపతి. ఐదేళ్లు గందరగోళంగా మారిన నగర వ్యవస్థను గాడిలో పెట్టడం పెద్ద సవాలు. తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్‌గా నారపరెడ్డి మౌర్య ఆ సవాలును స్వీకరించారు. ఆర్థిక సమస్యలు అధిగమిస్తూ, ప్రజాప్రతినిధులనూ, అధికార యంత్రాంగాన్నీ సమన్వయం చేసుకుంటూ సాగుతున్నారు. నగరపాలక సంస్థ సారథిగా బాధ్యతలు చేపట్టి నేటికి సరిగ్గా ఏడాది అయిన సందర్భంగా కమిషనర్ మౌర్యతో ఆంధ్రజ్యోతి సంభాషణలోని ముఖ్యాంశాలు..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



తిరుపతి నగర కమిషనర్‌గా మౌర్య బాధ్యతలు చేపట్టి నేటితో ఏడాది

■ ఇంటర్వ్యూ

తిరుపతి తీరు మారుతోంది

● యూడీఎస్, సీవోసీ, ప్రతిరోజూ తాగునీరు లక్ష్యాలు

? సవాలుగా స్వీకరించిన బాధ్యత

! రాయలసీమలోనే అత్యంత ప్రాధాన్యం ఉన్న వేడుక తిరుపతి గంగ జాతర. ఆ బాధ్యతలను నాకు అప్పగించారు. నాలుగు నెలలముందే వైకుంఠం టోకెన్ల జారీ సమయంలో తొక్కిసలాట ఘోరం కళ్లముందు మెదుల్తానే ఉంది. అన్ని విభాగాలతో సమన్వయ సమావేశాలు నిర్వహించాను. చాటింపు రోజు నుంచి కంకణం కట్టుకున్నట్టుగా గంగమ్మ ఆలయంలోనే తిష్టవేసి కూర్చున్నా. సీసీ కెమెరాలను పరిశీలిస్తుండేదాన్ని. వీఐపీ పాసులను రద్దుచేశాం. ఉత్సవ కమిటీ సభ్యుల సపరివార సమేత హడావుడిని తగ్గించా. జాతర చివరి రెండు రోజులు గర్భగుడిలోకి అర్చకేతరులను అనుమతించలేదు. ఒకవైపు కార్పొరేషన్, తుడా బాధ్యతలు చూస్తూ, మరో వైపు జాతరలో ఓ భక్తురాలిగా పొంగళ్లు పెట్టి, సారెలు ఇస్తూ భక్తుల అవసరాలను అడిగి తెలుసుకుంటూ జాతరను జయప్రదం చేయడంలో ప్రధాన భూమిక పోషించానన్న సంతృప్తి కలిగింది.

? పన్నుల వసూళ్లు

! పన్నుల వసూళ్లలో తిరుపతి నగరపాలక సంస్థ రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచింది. 2023-24లో రూ.84కోట్లు మాత్రమే వసూళ్లు కాగా, ఈసారి వంద కోట్ల మార్కు దాటింది. 2024 వరకు ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ టెండరు రూ.2.58కోట్లు మాత్రమే. అదిప్పుడు జీఎస్టీతో కలిపి దాదాపు రూ.5కోట్లకు పెరిగింది.

? టీడీఆర్ బాండ్లపై ప్రజల్లో అసంతృప్తి ఉంది.

! నేను బాధ్యతలు తీసుకునే ముందు టీడీఆర్ బాండ్ల అవకతవకలపై గందరగోళ పరిస్థితులు ఉండేవి. ఓవైపు విజిలెన్స్ విచారణ జరుగుతోంది. మరో వైపు టీడీఆర్ మేళా ద్వారా పరిశీలన చేసి నిజమైన లబ్ధిదారులకు బాండ్లు అందజేశాం. ఇప్పటివరకు 242 మందికి బాండ్లు ఇచ్చాం.

? ఏడాదిలో ఏమేం చేశారు.

! రూ.30కోట్లతో 267 అభివృద్ధి పనులను చేపట్టాం. కొత్తరోడ్లు, ప్యాచ్‌వర్కులు, కాలువల్లో పూడికతీత, తాగునీటి పైపులైన్ల మరమ్మతులు వంటి పనులు జరిగాయి. మరో రూ.30కోట్లతో 50 పనులు టెండరు దశలో ఉన్నాయి. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కొర్లగుంట సర్కిల్ (ఆరోగ్య ఫార్మసీ) డ్రైనేజీ సమస్యను పరిష్కరించాం. ఎమ్మార్ పల్లిలో యాచకులకు పునరావాస కేంద్రం ఏర్పాటుచేశాం.

ఇవి చేయబోతున్నాం!

- కేంద్ర ప్రభుత్వ ప్రజారోగ్య, పర్యావరణ ఇంజనీరింగ్ సంస్థ (చెప్కో) తిరుపతిలో యూడీఎస్ ప్రక్షాళనకు దాదాపు రూ.90కోట్లు వెచ్చించేందుకు ముందుకొచ్చింది. ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా మురుగునీటిని శుద్ధి చేసి వ్యవసాయానికి వినియోగించేలా చర్యలు చేపడుతున్నాం.
- మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణ పనులు నేను బాధ్యతలు తీసుకునేప్పటికి పాతిక శాతం కూడా జరగలేదు. 8 నెలల్లోనే 70 శాతం పూర్తి చేశాం. మరో 8 నెలల్లో పూర్తి చేస్తాం.
- స్కావెంజర్స్ కాలనీకి రంగులు వేయడమే కాదు. వారి జీవితాలను రంగులమయం చేయాలని వుంది. ● తిరుపతిని వెడ్డింగ్ డెస్టినేషన్‌గా మార్చాలని ఇటీవల తిరుపతి పర్యటనలో సీఎం చెప్పారు. ఆ దిశగా ప్రణాళికలు జరుగుతున్నాయి. పెళ్లిళ్లు, జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు అవసరమైన అన్ని హంగులు మరో రెండేళ్లలో తిరుపతికి రానున్నాయి.
- మరో రూ.50కోట్లతో నగరమంతా ప్రతి రోజూ నీరు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.
- శ్రీనివాసం సమీపంలో ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేయనున్నాం. ● లీలామహల్ వద్ద ఉన్న ఫిష్ మార్కెట్‌ను రేణిగుంట రోడ్డులోని ఓ మాస్టర్ ప్లాన్ రోడ్డు వద్దకు మార్చబోతున్నాం.
- స్ట్రీట్ వెండింగ్‌పై సర్వే చేసి కార్డులు ఇచ్చి వెండింగ్ జోన్‌లు పెట్టడం వల్ల ఫుట్‌పాత్ ఆక్రమణలు తగ్గించబోతున్నాం.

కొనసాగుతున్న ఒంటరి ఏనుగు దాడులు

● పాళెం, జూపల్లి ప్రాంతాల్లో పంటల ధ్వంసం ● కట్టడికి సోలార్ రిఫ్లెక్టర్ లైట్ల ఏర్పాటు

కల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాళెం పంచాయతీలో మంగళవారం రాత్రి ఒంటరి ఏనుగు దాడిలో మామిడి చెట్లు ధ్వంసమయ్యాయి. తూర్పు విభాగం అటవీ ప్రాంతం చింతలవంక నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు పాళెం వద్దకు చేరుకుంది. గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యులు మురళీధర్, రైతు కృష్ణమూర్తికి చెందిన మామిడిచెట్ల కొమ్మలను ఒంటరి ఏనుగు విరిచేసింది. జూపల్లిలోని రైతు కళావతికి చెందిన మామిడి చెట్లను ధ్వంసం చేసింది. అక్కడి నుంచి వచ్చిన దారిలోనే అడవిలోకి తిరుగుముఖం పట్టింది. బుధవారం పగలంతా చింతలవంక సమీపంలో సంచరించినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

● సోలార్ రిఫ్లెక్టర్ లైట్ల ఏర్పాటు

ఏనుగులు, ఇతర అడవి జంతువుల నుంచి అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలకు రక్షణగా సోలార్ రిఫ్లెక్టర్ లైట్లు ఏర్పాటు చేసినట్లు ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫి తెలిపారు. మండలంలోని కల్లూరు, పాళెం, దేవళంపేట పంచాయతీల్లో ఏనుగులు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో 10 లైట్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ సోలార్ లైట్లు పగలు రీచార్జి చేసుకుంటాయని, రాత్రి పూట ఈ లైట్లు కిరణాలు జంతువుల కళ్లల్లో పడితే ఆపై అటువైపుగా అడవి జంతువులు రావని తెలిపారు.





ఒంటరి ఏనుగు దాడిలో ధ్వంసమైన మామిడిచెట్టు - కల్లూరు సమీపంలో హైవే రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన సోలార్ రిఫ్లెక్టర్ లైట్

గోకులం పనులు పూర్తయిన చోట్ల బిల్లులు ఎందుకు అప్‌లోడ్ చేయడం లేదు

● కలెక్టర్ ఆగ్రహం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్ల నిర్మాణం ప్రగతి భేష్‌గా ఉందని, కానీ పనులు పూర్తయిన చోట్ల బిల్లులను అప్‌లోడ్ చేయడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారంటూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి గోకులం షెడ్ల నిర్మాణం, పశుసంవర్ధక, డ్వామా శాఖల ఏపీవో, ఏపీడీలతో క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరుపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గోకులం షెడ్ల నిర్మాణ పనుల్లో మండలాల్లో ఆమోదం పొందనవి ఎన్ని? పూర్తయినవి ఎన్ని? బిల్లులు జనరేట్ అయ్యాయా? లేవా? షెడ్ల గోడల నిర్మాణం ఎంతవరకు వచ్చాయనే అంశాలపై ఆయన అధికారులతో సమీక్షించారు. మార్కింగ్ చేసిన పనులను వెంటనే ప్రారంభించాలని, నాలుగు స్టేజీల్లో బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పనులు పూర్తయిన వెంటనే ఎంబుక్‌లో నమోదుచేసి బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. నిధుల కొరత లేదన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 2,795 పనులు మంజూరు కాగా, రూ.62.93 కోట్ల నిధులతో 1,588 పనులు పూర్తయ్యాయని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి యాదమరి మండలానికి రూ.4.32 కోట్ల నిధులతో 190 గోకుల షెడ్లు, గుడుపల్లె మండలానికి రూ.2.87 కోట్ల నిధులతో 125 షెడ్లు, కుప్పం మండలానికి రూ.5.69 కోట్ల నిధులతో 248 షెడ్లు, శాంతిపురం మండలానికి రూ.2.99 కోట్ల నిధులతో 130 గోకులం షెడ్లు మంజూరయ్యాయని కలెక్టర్ వెల్లడించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ఎస్పీని కలిసిన ప్రొబేషనరీ ఎస్‌ఐలు



ఎస్పీకి పండ్లబుట్టను ఇస్తున్న ప్రొబేషనరీ ఎస్‌ఐలు

చిత్తూరు అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లాకు కేటాయించిన ఎనిమిది మంది ప్రొబేషనరీ ఎస్‌ఐలు బుధవారం ఎస్పీ మణికంఠను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారితో మాట్లాడుతూ కొత్తగా విధుల్లో చేరుతున్న ఎస్‌ఐలు నిజాయితీగా పనిచేయాలని, ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. బాధ్యతాయుతంగా పనిచేసి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

చిత్తూరులో వాన

చిత్తూరు కల్చరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో బుధవారం రాత్రి తుంపర్ల వాన కురిసింది.రాత్రి 7.30గంటలనుంచీ 10 గంటల వరకు విడిచి విడిచి వర్షం పడుతుండడంతో బజార్లలో జనం ఇక్కట్లు పడ్డారు. వ్యాపారాలన్నీ బోసిపోయాయి.

అడవి జంతువుల దాడిలో 15 గొర్రెల మృతి

● ఏడింటికి గాయాలు



చనిపోయిన గొర్రెలను పరిశీలిస్తున్న అధికారులు

రామకుప్పం/శాంతిపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం చెంగుబల్ల గ్రామ శివార్లలో మంగళవారం రాత్రి అడవి జంతువులు ఓ గొర్రెల పాకపై దాడికి పాల్పడి 15 గొర్రెలను చంపేశాయి. దాడిలో మరో ఏడు గొర్రెలు గాయాలకు గురయ్యాయి. చెంగుబల్లకు చెందిన రైతు కృష్ణప్ప గ్రామ శివార్లలోని ఓ ఇంట్లో నివాసముంటూ గొర్రెల పెంపకంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఇంటి పక్కన ఉన్న గొర్రెల పాకపై అడవి జంతువులు దాడి చేశాయి. కృష్ణప్ప ఉదయం లేచి చూడగా 15 గొర్రెలు గాయాలతో చనిపోగా.. ఏడుగొర్రెలు గాయాలకు గురైనట్లు గుర్తించాడు. సమాచారం అందుకున్న కుప్పం అటవీ క్షేత్రాధికారి జయశంకర్, తహసీల్దారు శివయ్య తమ సిబ్బందితో కలిసి చనిపోయిన గొర్రెలను పరిశీలించారు. అడవి కుక్కలు, లేకుంటే తోడేళ్ల దాడిలో గొర్రెలు చనిపోయి ఉంటాయని అటవీక్షేత్రాధికారి జయశంకర్ తెలిపారు. పోస్టుమార్టంలో సమాచారం తెలుస్తుందన్నారు. తనకు జీవనాధారంగా ఉన్న గొర్రెలు మృతి చెందాయని, తనకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు అధికారులను కోరారు.

తలకోన సిద్ధేశ్వరాలయానికి మహర్దశ

● రూ.18 కోట్ల టీటీడీ నిధులతో ఆలయ పునరుద్ధరణ
● నిధుల మంజూరు, ఇ-టెండర్లకు ప్రభుత్వ అనుమతి

తిరుపతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తలకోనలోని సుప్రసిద్ధ సిద్ధేశ్వరాలయానికి మహర్దశ పట్టనుంది. రూ.18 కోట్ల టీటీడీ నిధులతో ఆలయం పునరుద్ధరణకు నోచుకోనుంది. ఎర్రావారిపాలెం మండలం తలకోన అటవీ ప్రాంతంలోని సిద్ధేశ్వరాలయం పురాతనమైనది. తలకోనకు రోజువారీ వచ్చే పర్యాటకులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులూ ఈ ఆలయాన్ని సందర్శిస్తుంటారు. జనవరి 1, మహా శివరాత్రి, కార్తీక మాసంలో వేలాది మంది భక్తులు తలకోనకు వచ్చి పుణ్యస్నానాలు చేసి సిద్ధేశ్వరాలయంలో పూజలు చేయడం ఆనవాయితీ. ఇప్పటికే అక్కడ టీటీడీ అతిథి గృహాలున్నాయి. తాజాగా భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు టీటీడీ ముందుకొచ్చింది. టీటీడీ ఇంజనీర్లు, స్థపతి క్షేత్రస్థాయిలో పర్యటించి ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ పునరుద్ధరణకు, ఇతర అభివృద్ధి పనులకు రూ.18 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఆ నిధులతో గర్భాలయం, మండపాలు, రాజగోపురం, ధ్వజస్థంభం వంటి వాటితో పాటు ఇతర నిర్మాణాలనూ చేపడతారు. ఇంజనీరింగ్ అధికారుల అంచనాలు రూపొందించాక ఈ ఏడాది మార్చి 24న జరిగిన టీటీడీ బోర్డు సమావేశంలో రూ.18 కోట్లు ఆర్థిక సాయం చేయడానికి ఆమోదిస్తూ తీర్మానం చేశారు. దీనిపై టీటీడీ ఈవో నిధులు మంజూరు చేయడంతో పాటు తొలి విడత ఇ-టెండర్లు పిలిచి రూ.2 కోట్లతో పనులు చేపట్టేందుకు అనుమతి కోరుతూ ఏప్రిల్ 16న ప్రభుత్వానికి లేఖ రాశారు. దానిపై స్పందించిన ప్రభుత్వం నిధుల మంజూరుకు, ఇ-టెండర్లు పిలవడానికి అనుమతిచ్చింది. ఈ మేరకు దేవదాయ శాఖ ఎఫ్ఏసీ ముఖ్య కార్యదర్శి వి.వినయ్‌చంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.



28 వేలమంది ఇంటర్ విద్యార్థులకు 'తల్లికి వందనం' నిధులు జమ

చిత్తూరు సెంట్రల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 28,166మంది విద్యార్థులకు తల్లికి వందనం నిధులు వారి తల్లుల బ్యాంకు ఖాతాలో జమైనట్లు ఇన్‌చార్జి డీఐఈవో దయానందరాజు తెలిపారు.జిల్లావ్యాప్తంగా 130 జూనియర్ కళాశాలల్లో 28,166 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఇందులో ఫస్టియర్‌లో 12,664 మంది, సెకండియర్‌లో 15,502 మంది ఉన్నారని చెప్పారు. 31 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 7,211 మంది, ఆరు మోడల్ స్కూల్లో 843 మంది, హైస్కూల్ ప్లస్‌లో 605 మంది, ఎనిమిది కేజీబీవీల్లో 582 మంది, 60 ప్రైవేటు యాజమాన్య కళాశాలల్లో 18,445 మంది, ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో 122 మంది, నాలుగు సోషల్ వెల్ఫేర్ కళాశాలల్లో 358 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. వీరికి గాను తల్లికి వందనం పథకం కింద రూ.13 వేల చొప్పున వారి తల్లుల ఖాతాల్లో మొత్తంగా రూ.36,61,58,000 నిధులు జమైనట్లు తెలిపారు.

యాజమాన్యాల ఖాతాలోకి తల్లికి వందనం నిధులు

● ప్రభుత్వ కోటా విద్యార్థుల విషయమై డీఈవో వెల్లడి

విద్యా హక్కు చట్టం కింద ప్రభుత్వ కోటాలో ప్రైవేటు పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు తల్లికి వందనం నిధులు నేరుగా పాఠశాల యాజమాన్యం ఖాతాలో జమ కానున్నట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. తమ పిల్లలకు తల్లికి వందనం నిధులు జమకాలేదని తరచూ వస్తున్న ఫిర్యాదులపై డీఈవో స్పందించారు. రాష్ట్రప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించినట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకుని ప్రభుత్వ కోటా కింద ఒకటవ తరగతిలో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన తల్లికి వందనం నిధులు ఆ పాఠశాల యాజమాన్యం ఖాతాలోకి జమవుతాయన్నారు. వీటి ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వ కోటా కింద చేర్పించిన విద్యార్థుల నుంచి ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిస్తే, తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఫిర్యాదు ఆధారంగా ఆ పాఠశాల యాజమాన్యంపై చర్యలుంటాయని హెచ్చరించారు.

బోయకొండ ఆలయ నిధుల స్వాహాపై విచారణ



ఆలయ ఈవో ఏకాంబరంతో మాట్లాడుతున్న ఎస్ఐ నాగేశ్వరరావు

చౌడేపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో నిధులు స్వాహా చేసిన కేసును విచారణ చేపట్టినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఈవో ఏకాంబరం ఫిర్యాదుతో తాను బుధవారం ఆలయ ఈవోతో చర్చించి చేతి వాటం చూపిన సిబ్బందిపై విచారణ చేపడుతున్నామన్నారు. కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.



డిప్యూటీ సీఎం, సినీ హీరో పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' సినిమాను బుధవారం రాత్రి పలు కేంద్రాల్లో అభిమానుల కోసం ప్రదర్శించారు. ఈ ఫ్యాన్స్ షో సందర్భంగా తిరుపతిలో గ్రూప్ థియేటర్స్ వద్ద సందడి కనిపించింది. అభిమానులు, జనసైనికులు టపాసులు కాల్చి, పవన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి, కర్పూర హారతులిచ్చి తమ అభిమానం చాటారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

జాతీయ భద్రతపై సెమినార్‌కు కలెక్టర్

తిరుపతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ భద్రతపై కేంద్ర ప్రభుత్వం సెప్టెంబరు 15నుంచి 19వ తేదీ వరకూ నిర్వహించనున్న సెమినార్‌కు కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరు కానున్నారు. హైదరాబాదులోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో జరిగే ఈ సెమినార్‌కు ఏపీ నుంచీ ప్రభుత్వం ఆయన్ను డెప్యుటేట్ చేసింది. దీనికోసం ఆయన సెప్టెంబరు 12వ తేది రిలీవ్ అయి.. 14న అకాడమీలో రిపోర్టు చేసుకుని, ఐదు రోజుల కార్యక్రమం పూర్తయ్యాక 20 లేదా 21న తిరిగి కలెక్టర్‌గా జిల్లాలో విధుల్లో చేరనున్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF SURNAME
I,SHAIK AMEERUNNISA (Old Name) W/o MOGHAL GHOUSE MOHIDDIN R/o.12-803, Bugga Street, Renigunta, TIRUPATI Dt. AP-517520. I changed my Surname to MOGHAL AMEERUNNISA (New Name) W/o MOGHAL GHOUSE MOHIDDIN. Henceforth I will be known as MOGHAL AMEERUNNISA (New Name).
AJT -1465

CHANGE OF SURNAME
I, CHERUKURU SUJANA (Old Name) W/o CHERUKURU SRINIVASULU REDDY R/o D.NO:6/36-2, East Street, East Gudur, GUDUR - 524101, TIRUPATI DIST, Andhra Pradesh. I changed my name to MOPATI SUJANA. Hence forth, i will be known as MOPATI SUJANA.
AJT -1468

WANTED
ప్రముఖ ఏజెన్సీ నందు కలెక్షన్ జాబ్ వేకెన్సీస్ కలదు. డీఆర్ఏ ఉన్నవారికి ప్రాధాన్యత, జాబ్ వేకెన్సీ లోకేషన్: తిరుపతి, మదనపల్లి, పీలేరు, పలమనేరు. సంప్ర:96767 83441, 73302 99580
AJT -1462

WANTED
Project Manager to work at STEPS NGO, APSACS (Exp in HIV AIDS) Project,Nagari, Tirupati Dist. (Q) MSW, MA. Psychology. Send Resume to ngosteps@gmail.com Contact: +919390 028595, 79897 27460. Last Date :30-07-25
AJT -239938

WANTED
మీరు 10th క్లాస్ పాస్‌అయి ఉన్నారా! అయితే LIC బీమాసఖీ (జీతం+ కమీషన్) కొరకు సంప్రదించండి. AKCS రెడ్డి, LIC of India, Tirupati. Cell: 90599 19948
AJT -1459

TOLET
తిరుపతి రైల్వేకాలనీ 5వ క్రాస్ డోర్ నెంబర్ 18-4-154 నందు 3BHK ఇల్లు అన్ని సౌకర్యములతో కబోర్డ్స్ మోటర్స్ కివెన్ పార్కింగ్ సౌకర్యాలతో బాడుగకు ఇవ్వబడును. బాడుగ నెలకు 25,000.సంప్ర: 97042 77655
AJT -1447

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, పిక్కింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 237925

CHANGE OF NAME
I, Bokkisam Ammulu (Old Name), R/at D.No. 1-10, Ravillavaripalle, Patthiputtur, Ramachandra puram (M), Tirupati Dist, AP, have changed my name to Amilneni Bujji (New Name) W/o Late Amilneni Vasu.
AJT -1463

CHANGE OF NAME
I, Mogilia Rukmini (Old name) W/o Gunthakal Dasaratha Balaji, D.No.6-8-806/D, Sanjeevaiah Nagar, Tirupati Urban,Tirupati Dist ,A.P., Declare that I have changed my name as MOUGILYA RUKMINI (New Name) .
AJT -1467

CHANGE OF SURNAME
I,SHAIK GOUSE MOHIDDIN (Old Name)S/o MOGHAL KHASIM SAB R/o.12-803,Bugga Street, Renigunta, TIRUPATI Dt. AP-517520. I changed my Surname to MOGHAL GHOUSE MOHIDDIN (New Name) S/o MOGHAL KHASIM SAB. Henceforth I will be known as MOGHAL GHOUSE MOHIDDIN (New Name).
AJT -1466

CHANGE OF NAME
I, BAJRANGLAL RAVI KUMAR GOEL(Old Name) S/o BAJRANG LAL AGARWAL R/o 10-13-531, Reddy and Reddy Colony,TIRUPATI 517501,Andhra Pradesh. I changed my name to BAJRANGLAL RAVI KUMAR GOYAL. Hence forth, i will be known as BAJRANG LAL RAVI KUMAR GOYAL.(New Name).
AJT -497

TOLET
తిరుపతి బ్లిస్ హోటల్ వెనుక జయనగర్ నందు వేణి విశ్వ విహార్ బిల్డింగ్ ఉమెన్స్ హాస్టల్‌కు రెంట్ (TOLET)కి ఇవ్వబడును. సెల్: 99895 68666
AJT -1449

అమ్మకము
R.C.రోడ్డులోని ఎం.ఆర్.పల్లి పోలీస్‌స్టేషన్ సర్కిల్ దగ్గర అపోలో ఫార్మసీ ప్రక్కగల షాపునందు అపోలో టైర్స్,Vredestein Tyres, వీల్ అలైన్‌మెంట్, వీల్‌బ్యాలన్స్, టూవీలర్ టైర్స్ Fit చేయబడును. శ్రీ శ్రీనివాస టైర్స్, తిరుపతి, సెల్: 88855 56419.
AJT - 239964

ఒకేషనల్ కోర్సులు
మంచి జాబ్ అవకాశం గల ఒకేషనల్ ANM/MPHW (నర్సింగ్/ MLT/ డైరీసైన్స్ (లైవ్‌స్టాక్)/ అగ్రికల్చర్ కోర్సులు తిరుపతిలోని Dr. VBR ఒకేషనల్ కాలేజి నందు కలవు. స్కాలర్ షిప్ సదుపాయం కలదు. Q:10th పాస్, ఇంటర్ ఫెయిల్, సెల్: 81250 40004
AJT - 1434

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతర త్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, పట్ల వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం



భాస్కర్ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న ఆనందరెడ్డి

రామకుప్పం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ గడ్డూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త భాస్కర్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మహ్మద్‌రఫీ, క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డిలు స్థానిక నేతలతో కలిసి బుధవారం భాస్కర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి పార్టీ తరఫున రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జనసేన మండల ప్రధానకార్యదర్శి భాస్కర్, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి మునిరెడ్డి, మాజీ సర్పంచి పెరుమాళ్, నేతలు సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్‌రెడ్డి, సతీష్, లింగాపురం సుబ్రహ్మణ్యం, మురళీమోహన్, చంద్రయ్య, రవి, శ్రీకాంత్, వెంకటరమణ, రామచంద్ర, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు చర్యలు



డాక్టర్‌కు సూచనలిస్తున్న జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

పలమనేరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): డెంగీ, మలేరియా వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ సూచించారు. బుధవారం పలమనేరు మండలం కొలమాసనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి వైద్యాధికారి అనోకితో పాటు వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. వర్షాలు కురుస్తున్నందున దోమలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. దోమల నివారణ సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. ప్రతిఒక్క పౌరుడిని ఇందుకోసం చైతన్యపరచాలన్నారు. ఇందుకోసం ఒక ప్రణాళిక తయారు చేసి అమలయ్యేలా పరిశీలించాలని వైద్యాధికారికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి జయశంకర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సత్యగంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపులో అధికారులు, భక్తులు

పలమనేరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పలమనేరు పాతపేటలోని సత్యగంగమ్మ ఆలయంలో బుధవారం దేవాదాయశాఖ కార్యనిర్వహణ అధికారి కమలాకర్ సమక్షంలో హుండీ లెక్కింపు చేశారు. భక్తులు అమ్మవారికి రూ.1,80,770 కానుకలుగా చెల్లించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లి డివిజన్ దేవాదాయశాఖ తనిఖీ అధికారి శశికుమార్, సిబ్బంది విజయభాస్కర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకే పీ4 పథకం

సోమల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పేదరికాన్ని తగ్గించడమే పీ-4 పథకం ముఖ్య ఉద్దేశమని ఎంపీడీవో నారాయణ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలతో కలిసి పేదరికాన్ని క్షేత్రస్థాయిలోనే గుర్తించాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

కందూరులో మహాభారత యజ్ఞం



హరికథ చెబుతున్న భాగవతారిణి గీతాశ్రీ

సోమల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరులో మహాభారత యజ్ఞం సందర్భంగా బుధవారం పంచపాండవ విగ్రహాలకు ఆలయ ధర్మకర్త పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ క్రమంలోనే భాగవతారణి గీతాశ్రీ దుర్యోధనుడు బలిబండిపై భోజన సేకరణ బయలుదేరు విధానంపై వివరించారు. గ్రామంలో బలిబండిపై దుర్యోధనుడు అన్న సేకరణ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి పీలేరు, చంద్రగిరి శ్రీవెంకటేశ్వర నాటక మండలి సభ్యులు నాటక ప్రదర్శన ఆకట్టుకుంది.

ఆగిన తరగతి గదుల నిర్మాణం



సోమల ఉన్నత పాఠశాలలో ఆగిపోయిన నిర్మాణాలు

సోమల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సోమల ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పథకంతో అదనపు గదుల నిర్మాణం మూడేళ్ల క్రితం ప్రారంభించారు. సగం పనులు పూర్తి చేసి మిగిలిన పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో విద్యార్థులు ఆరు బయట విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులు అసౌకర్యాలతో ఇబ్బంది పడుతున్నారు. జిల్లా అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా నిధులు మంజూరు కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. అధికారులు స్పందించి అసంపూర్తి భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



ప్రహరీ పనులను పరిశీలిస్తున్న ఎంఈవోలు

కల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేయాలని ఎంఈవోలు శిద్ధరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రహరీ నిర్మాణ పనులను బుధవారం వారు పరిశీలించారు. పాఠశాలల్లో జరుగుతున్న పనులు నాణ్యతగా ఉండాలని, త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. భోజనం రుచికరంగా తయారు చేయాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం తరగతి గదుల్లో ఉపాధ్యాయుల విద్యా బోధనను పరిశీలించారు.

విద్యార్థులకు విద్యే ఆయుధం



రాజేంద్రన్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

పుంగనూరు రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యే ఆయుధమని పుంగనూరు ఎన్‌ఎస్‌పేట ఉర్దూ స్కూల్ ఉపాధ్యాయులు ఎస్.రాజేంద్రన్ అన్నారు. బుధవారం స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రాజేంద్రన్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో జీవితంలో ఉన్నత స్థానాలను ఎలా చేరుకోవాలో తెలిపారు. ఉపాధ్యాయుడు రాజేంద్రన్‌ను ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు అనిల్ కుమార్ సత్కరించారు.

29న గంగవరం మండల సమావేశం

గంగవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గంగవరం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

చరిత్రలో నిలిచిపోయేలా రాష్ట్ర ప్రగతి

● గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రగతి బాటలో పయనిస్తోందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన శాంతిపురంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ల కృషి ఫలితంగా రాష్ట్రంలో వేలాది కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయన్నారు. తద్వారా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. అమరావతిని ప్రజా రాజధానిగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 240కి పైగా ప్రభుత్వ సేవల్ని వాట్సాప్‌లో ప్రజలకు చేరువ చేస్తోందన్నారు. రికార్డు స్థాయిలో తల్లికి వందనం పథకాన్ని అమలు చేసిందన్నారు. అలాగే రాష్ట్రంలో గ్రీన్‌ఎనర్జీ కారిడార్ ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలను పెంచిందన్నారు. వచ్చే నెల 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనుందన్నారు. ఏడాది రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ప్రజల్లో సర్వత్రా సంతృప్తి వ్యక్తమౌతోందన్నారు. రానున్న ప్రతి ఎన్నికల్లో టీడీపీకే ప్రజలు విజయం చేకురుస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అరాచక, అవినీతి నాయకత్వం ఉన్న పార్టీని ప్రజలు పట్టించుకోరని వివరించారు.

స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలి



పుంగనూరులో సీపీఐ నేతల నిరసన

పుంగనూరు రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లు అమర్చి ప్రజలపై భారం మోపకుండా వెంటనే ప్రభుత్వం మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని.. స్మార్ట్‌మీటర్లు అమర్చడాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. రద్దు చేయకుంటే రానున్న రోజుల్లో ప్రజలు, రైతులతో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రామమూర్తి, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వెంకటరమణారెడ్డి, ఏఐఎస్ఎఫ్ సభ్యుడు మున్నా పాల్గొన్నారు.

యల్లమ్మకు ప్రత్యేకాలంకరణ



రొంపిచెర్ల, జూలై 23 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని బొమ్మయ్యగారిపల్లె గుట్టకింద హరిజనవాడలోని మావూరి యల్లమ్మ గురప్పస్వామి ఆలయంలో బుధవారం స్వామి, అమ్మ● వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, అర్చనలు, పొంగళ్లు పెట్టి అమ్మవారిని కొలిచారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీవో వాణిశ్రీ దేవి

రొంపిచెర్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐసీడీఎస్ పులిచెర్ల సీడీపీవో వాణిశ్రీదేవి అన్నారు. ఆమె బుధవారం రొంపిచెర్ల మండలంలో ఫజులూపేట, రొంపిచెర్ల-2, బలిజవీధి, ముత్యాలమ్మగుడి వీధి, ఆర్‌సీపురం కాలనీ, బోడిపాటివారిపల్లె అంగన్వాడీ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టారు. రికార్డులు, పిల్లల హాజరు పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శిరీష పాల్గొన్నారు.

జిల్లాల పునర్విభజనపై మంత్రులతో

ఉపసంఘం ఏర్పాటు హర్షణీయం

కల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజన అంశంపై సీఎం చంద్రబాబునాయుడు ఏనుగురు మంత్రులతో ఉప సంఘం ఏర్పాటు చేయడం హర్షణీయమని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు రామనాథం నాయుడు తెలిపారు. పులిచెర్ల మండలం రాయవారిపల్లిలో బుధవారం ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన జిల్లాల పునర్విభజనపై అప్పట్లో ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల సౌలభ్యం కోసం జిల్లాల పునర్విభజపై సీఎం దృష్టి సారించారన్నారు. పులిచెర్ల మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపాలని ఇటీవల సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లామని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు తెలిపారు.

చినుకు పడితే చిత్తడే..!

● పుంగనూరులో బురదమయంగా వీధులు ● నాసిరకం సీసీ రోడ్లతో ప్రజల అవస్థలు



పుంగమ్మ చెరువు కట్టపై అధ్వానంగా ఉన్న బెంగళూరు రోడ్డు



మినీబైపాస్ రోడ్డు ప్రాంతంలో గుంతలుగా మారిన రోడ్డు



శనేశ్వరస్వామి ఆలయ ప్రాంతంలో బురదమయంగా ఉన్న రహదారి

పుంగనూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్లు చిత్తడిగా మారి అధ్వానంగా తయారవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పలు ప్రాంతాల్లో నిర్మించిన సిమెంట్ రోడ్లు నాసిరకంగా ఉండటంతో కొద్దిరోజులకే పాడై గంతలు పడటం, చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిలిచి దుస్థితికి చేరుకుంటున్నాయి. సిమెంటు లేచిపోయి కంకర రోడ్లు మాదిరిగా ఎల్‌ఐసీ కాలనీ, సాయిబాబాగుడి ఏరియా, కొత్తఇండ్లు, దోబీ కాలనీ తదితర ప్రాంతాల్లో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. అనేక చోట్ల మున్సిపాలిటీ, ప్రభుత్వం రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో మట్టిరోడ్డు చిత్తడిగా, బురద, గుంతలతో ఉన్నాయి. పుంగనూరు నుంచి బెంగళూరుకు వెళ్లే రహదారిలోని పుంగమ్మచెరువు కట్ట, శనేశ్వరస్వామి ఆలయ ప్రాంతం, సింగరిగుంట తదితర చోట్ల మోకాలులోతు గుంతలు పడటంతో ద్విచక్ర వాహనదారులు, కార్లు, జీపులు, బస్సులు, లారీల చోదకులు, ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కర్ణాటక నుంచి ప్రతి ఆదివారం బోయకొండ గంగమ్మ ఆలయ దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు వస్తుంటారు. బైరెడ్డిపల్లె క్రాస్, కర్ణాటక సరిహద్దు నుంచి డబుల్ రోడ్డు బాగున్నా కేవలం పుంగనూరు నుంచి కేవలం ఆరు కిలో మీటర్ల దూరంలో చేరుకోవచ్చు. అయితే రోడ్డు పెద్దపెద్ద గుంతలతో భయపడి అధిక సంఖ్యలో పలమనేరు నుంచి దూరం అధికమైనా ఆ మార్గంలో బోయకొండకు వెళుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి బెంగళూరు రోడ్డు, పట్టణంలో అధ్వానం రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పేదరిక నిర్మూలనే చంద్రబాబు ధ్యేయం



చెల్దిగానిపల్లెలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పరిపాలన సాగిస్తున్నారని రామకుప్పం-2 క్లస్టర్ ఇన్‌చార్జి నాగభూషణం, కొంగనపల్లి యూనిట్ కో-ఇన్‌చార్జి రెడ్డిపురుషోత్తం, విజలాపురం, 89పెద్దూరు పంచాయతీల పార్టీ అధ్యక్షులు కుమార్, లోకేశ్ తెలిపారు. బుధవారం మండల పరిధి చెల్దిగానిపల్లె, 89పెద్దూరు, విజలాపురంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఏడాది పాలనలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నేతలు వెంకటాచలం, సురేష్, మురుగేష్, వేణు, నాగభూషణం, రామ్మూర్తి పాల్గొన్నారు.

వైభవంగా కాశీవిశ్వేశ్వరుడి కల్యాణం



అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరుడు

పుంగనూరు రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు కోనేరు వద్ద వెలసిన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారికి బుధవారం రాత్రి అత్యంత వైభవంగా కల్యాణోత్సవం జరిగింది. ఆలయంలో అర్చకులు బాలసుబ్రహ్మణ్యం, రామచంద్రస్వామి, నటరాజ దీక్షితులు, విజయ్ దీక్షితులు, హరీశ్ దీక్షితులు ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు, హోమాది కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కనులపండువగా స్వామివారి కల్యాణోత్సవం చేపట్టారు. పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గిరిజనుల ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు మాదిరాజు లక్ష్మీపతిరాజు

చౌడేపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపేట పంచాయతీ ఎర్రగానిపల్లెలో గిరిజనుల ఇళ్ల నిర్మాణానికి టీడీపీ నాయకులు మాదిరాజు లక్ష్మీపతిరాజు బుధవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. నాలుగేళ్లగా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను చేపట్టేందుకు ఆయన ముందుకొచ్చి పనులు చేయిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంపూర్తిగా వదిలేసిన 3 ఇళ్లను తాను తన సొంత నిధులతో పూర్తి చేసి ఇవ్వనున్నట్లు తెలిపారు. పనులు వేగంగా, నాణ్యతగా చేయాలని ఆయన మేస్త్రీలకు సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ పగడాల హరిప్రసాద్, కార్తీక్, నాగరాజరెడ్డి, మంజునాథ్‌రెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం



వ్యక్తి అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

కుప్పం, జూలై 23 (ఆంధ్ర జ్యోతి): కుప్పం మండలం మొట్లచేను గ్రామం వద్ద ద్విచక్ర వాహనంపై నాటు సారా తరలిస్తున్న పాపేడు (39) అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు కుప్పం ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం మొట్లచేను వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వచ్చిన పాపోడు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద క్యాన్‌లో 10 లీటర్ల నాటుసారా ఉన్నట్లు గుర్తించారు. విచారణలో అతను మొట్లచేనుకు చెందిన అన్నాదొరై, చిన్నబల్ల గ్రామానికి చెందిన రామ్‌కుమార్‌ల వద్ద నాటుసారా కొనుగోలు చేసినట్లు తెలపడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తనిఖీల్లో ఎస్సై మోహన్‌బాబు, సిబ్బంది చలపతి, ఆచ్చారి, వెంకటేష్, పన్నీర్‌సెల్వం, రేఖ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వనమహోత్సవం



రేంజర్‌కు జ్ఞాపిక అందిస్తున్న బీసీ నాగరాజ్

కుప్పం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో అటవీశాఖ సౌజన్యంతో కళాశాల ఆవరణలో బుధవారం వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కుప్పం రేంజర్ సమీర్ బాషా నేతృత్వంలో విద్యార్థులు విరివిగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ నాగరాజు మాట్లాడుతూ పారిశ్రామికీకరణ నేపథ్యంలో పర్యావరణం గురించి ఆలోచించడం అవసరమన్నారు. దశాబ్దాలుగా చెట్లను విచక్షణ రహితంగా నరకేయడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లిందన్నారు. అనంతరం రేంజర్‌తో సహా అటవీ సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ సునీల్‌రాజ్, ప్రిన్సిపాల్ ఎన్.సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, కోదండరామయ్య, ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్లు మాధవన్, గంగాధరన్, శరవణ, విభాగాధిపతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఏర్పాటుకు శ్రీకారం



శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఏర్పాటుకు చేపడుతున్న పనులు

సోమల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో శ్రీకృష్ణదేవరాయుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి బుధవారం కమిటీ సభ్యులు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలోనే క్రాస్ రోడ్డులో ఏర్పాటుకు అడ్డుగా విద్యుత్తు తీగలను మార్పు చేశారు. అలాగే స్థలాన్ని చదువును చేయిం చారు. ఈనెల 31న భూమిపూజ కార్యక్రమాలకు చర్యలు చేపట్టారు. శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి రూ.11 లక్షల వ్యయం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విశాంత్ర ఎంఈవో గోపతి మునిరత్నం సతీమణి రాజేశ్వరమ్మ రూ. 5 వేలు, ఎగువపల్లె జయప్రకాశ్ రూ. 5 వేలు, శీలం వారిపల్లెకు చెందిన నారాయణమ్మ రూ.10 వేలు విరాళం అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు మునివెంకటప్ప, కామిశెట్టి నగేశ్, సదాశివయ్య, డాక్టర్ హరినారాయణ, రఘు, శెట్టివారి మోహన్, జ్యోతీశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో రూ.1.5 లక్షల ఆస్తినష్టం

పలమనేరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో మంగళవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో రూ.1.5 లక్షల ఆస్తినష్టం జరిగింది. పలమనేరు భజంత్రీ వీధిలోని సుబ్రహ్మణ్యం అనే వ్యక్తికి చెందిన ఇంట్లో పొయ్యిపై నూనె అత్యధికంగా వేడిచేయడంతో నూనె మండుకొని ఇంటిలో మంటలు వ్యాప్తి చెందాయి. సమాచారం అందుకున్న పలమనేరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను వ్యాప్తి చెందకుండా అదుపు చేశారు. అయితే అప్పటికే ఇంట్లోని ఫ్రిజ్, టీవీ, విలువైన వస్తువులు, దుస్తులు కాలిపోయాయి.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు


కల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన అత్యాచారం కేసులో బుధవారం నిందితుడిని అరెస్టు చేసినట్లు కల్లూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. 22 ఏళ్ల యువతిని 55 ఏళ్ల వ్యక్తి బెదిరించి అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మండలంలోని కొమ్మిరెడ్డిగారిపల్లి క్రాస్ వద్ద నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నడివీధి గంగమ్మకు పూజలు

చిత్తూరు కల్చరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): నగరపాలక పరిధిలోని 5వ డివిజన్ రఘురాం నగర్‌లో బుధవారం నడివీధి గంగమ్మ జాతరను స్థానికులు ఘనంగా నిర్వహించారు.

గింజలతో పవన్ కల్యాణ్ చిత్రం

సోషల్ మీడియాలో చక్కర్లు



కుప్పం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, హీరో పవన్ కల్యాణ్ హరిహర వీరమల్లు చిత్రం విడుదల సందర్భంగా కుప్పంలోని జనసేన పార్టీ కార్యాలయంలో పీవోసీ నరేష్ ఆధ్వర్యంలో కుప్పం చిత్రకారుడు పూరీ ఆర్ట్స్ అధినేత పురుషోత్తం గింజలతో పవన్ ముఖచిత్రాన్ని అద్భుతంగా చిత్రీకరించాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారి చక్కర్లు కొట్టింది. ఈ ముఖచిత్రం చూసిన ప్రతిఒక్కరూ పూరీ ఆర్ట్స్ ప్రావీణ్యాన్ని అభినందించారు.

సుపరిపాలనతో చంద్రబాబుకు ప్రజా మన్ననలు

● ఎమ్మెల్యే జగన్మోహన్



టీ దుకాణం వద్ద స్థానికులకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు

చిత్తూరు సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనతో సీఎం చంద్రబాబు ప్రజల మన్ననలు పొందుతున్నారని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికీ మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలతో కలసి నగరంలోని 31, 32, 33, 34 డివిజన్‌లలో రాంనగర్ కాలనీలో పర్యటించారు. ఎమ్మెల్యే స్థానిక ప్రజలు, దుకాణదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేశామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, నేతలు కాజూరు బాలాజి, హేమావతి, బెల్లం సతీష్, కోలా కిరణ్, వరద తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చుక్కలు చూపించిన గత ప్రభుత్వం: టీడీపీ

గంగాధరనెల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న ఐదేళ్లపాటు రాజారెడ్డి రాజ్యాంగం అమలుతో అన్నివర్గాల ప్రజలకు చుక్కలు చూపించిన వైసీపీ నేతలు నేడు నీతులు వల్లించడం ఎంతవరకు సబబు అని పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, యూనిట్ ఇన్‌చార్జి పొదిలి రఘునాథ నాయుడు, టీడీపీ యువనేత పొదిలి వినోద్ నాయుడులు ధ్వజమెత్తారు. గంగాధరనెల్లూరు మండలంలోని పాచిగుంట, బుక్కాపట్నం పంచాయతీల్లో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో టీడీపీనేతలు ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను పంపిణీ చేశారు. నేతలు స్వామిదాస్, శ్రీధర్‌యాదవ్, దేవసుందరం, రామాంజులు, ధర్మారెడ్డి, మోహన్, రాము, రవి, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: మండల కేంద్రమైన పూతలపట్టులో బుధవారం టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి కరపత్రాలను ఇంటింటికెళ్లి వివరించి, అందించారు. టీడీపీ నాయకులు గుంటూరు మురళి, చిరంజీవి, పుష్పరాజ్, హరి, ముత్తు, సుబ్బరాజులు, రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్మనీ భాష నేర్చుకునే వారికి దరఖాస్తుల ఆహ్వానం

నగరి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో జర్మనీభాష నేర్చుకునేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పబ్లిక్ రిలేషన్ అధికారి పి.చంద్రకళ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్‌కోర్సు చేసి మూడు సంవత్సరాల అనుభవం కలిగిన ఎస్సీ, ఎస్టీ యువతకు తిరుపతిలో 8 నుంచి 10 నెలలపాటు జర్మన్ భాష నేర్పించనున్నట్లు తెలియజేశారు.

ఉపాధిలో కూలీల సంఖ్య పెంచండి

పాలసముద్రం, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పథకం పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో సతీష్ ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉపాధి హామీ పథకంలో రోజుకు 400 మంది కూలీలు మాత్రమే పని చేస్తున్నారని, ఇంత తక్కువ మంది పని చేస్తే ఎలా అని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి పంచాయతీలో వంద మంది కూలీలు పని చేసేటట్లు ఎఫ్‌ఏ, టీఏలు కూలీలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మార్గరేట్, ఈసీ రామమూర్తి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నోటీసు

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా గుడిపాల మండలం, నారగల్లు పంచాయతీ, ఏ.ఎల్. పురం పోస్టు, రఘునాథపురం గ్రామం వద్దగల పాళ్యం కొండపైన వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాన్ని దేవాదాయ శాఖ నందు సెక్షన్ 43 ప్రకారం రిజిస్టరు చేయదలచినాము. ఇందుకు ఏదైనా అభ్యంతరాలు ఉన్న ఎడల సహాయ కమిషనర్ దేవాదాయ శాఖ చిత్తూరు వారి కార్యాలయం నందు 15 రోజుల లోపు తెలియజేయగలరు.

ఇట్లు

పాళ్యం కొండ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధి సమితి

నారగల్లు పంచాయతీ, గుడిపాల మండలం

ఘనంగా రుద్రాభిషేకం

చిత్తూరు కల్చరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో బుధవారం మాస శివరాత్రి సందర్భంగా సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు ఉచితంగా పూజా ద్రవ్యాలను అందజేశారు. సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షులు మధుసూదనం, ప్రభాకర్ నాయుడు, పాండురంగం, శ్రీకంఠయ్య, దేవరాజులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడం ఏమనగా! నా కక్షిదారు మెస్సర్స్ శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, తిరుపతి బ్రాంచి-2 మేనేజర్ వారు ఇచ్చిన భోగట్ట ప్రకారము ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్థి చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురంలో యుండు కొళ్ళా పెద్దబ్బనాయుడు కుమారుడు కె. క్రిష్ణమనాయుడు మరియు ఇతని కుమారుడు కె. జగదీష్ గారికి చెందినదనియు, సదరు ఆస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని సదరు కె. తిరుమల ప్రకాష్ గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి జప్తులు, దార్జీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రి మెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలోగా ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా కక్షిదారు బాధ్యులు కారు.

షెడ్యూలు : 1వ అయిటం: చిత్తూరు డి., కార్వేటినగరం సబ్ డివిజన్ శ్రీరంగరాజపురం మండలం నెం. 57 శ్రీరంగరాజపురం గ్రామ సదరు గ్రామం లెక్క దాఖలా పుంజ సర్వే నెం. 38/ ఎ.14.88సెంట్లు 6-011లు పూరా భూమి 12ప్లాటుకు హద్దులు కె. చంగల్‌రాయనాయుడు ప్లాటు కు (తూ) జి. సుబ్బయ్య ప్లాటుకు (ప) చిత్తూరు- పుత్తూరు రోడ్డుకు (ఉ)నా భూమిని (ద) ఈమధ్య ఎ0.02 3/4 సెంట్లు 0.011లను సరియగు తూ.ప.ద. 10 లకు మీ 9.140లు ఉ.ద.గ.15లకు మీ 13.710 లు గల వాళ్ళ జాగా మాత్రం. ఈ ఆస్తి అసైన్‌మెంట్ కాదు. పాసుపుస్తకం లేదు. శ్రీరంగరాజపురం పంచాయతీకి చెందినది. షైజాగాకు.

షెడ్యూలు : 2వ అయిటం: చిత్తూరు జిల్లా, చిత్తూరు రి-డి., కార్వేటినగరం సబ్.డి., యస్.ఆర్. పురం మండలం, శ్రీరంగరాజపురం గ్రామ లెక్క దాఖలాలో, పుల్లూరు క్రాస్‌రోడ్డులో, పుంజ సర్వే నెం. 38/3, రులో పూరా విస్తీర్ణం ఎ.11.15 సెంట్లులో గల ఇంటి ఖాళీ జాగాకు హద్దులు కొలతలు వివరాలు. ఉత్తరం: రోడ్డు, దక్షిణం: కె. క్రిష్ణమనాయుడు జాగా, తూర్పు: మాజాగా, పడమర: మాజాగా, ఈ మధ్యన తూ.ప.అ30లకు మీ.9.144లున్ను, ఉ.ద.అ.24లుకు మీ.7.315లున్ను, ఇందుకు సరియగు చ.అ 720లు లేక చ.గ 80లు గల జాగా పూరాయున్ను, సదరు జాగాకు రాకపోకలకు గాను చిత్తూరు- పుత్తూరు రోడ్డు నుండి ఉత్తర దిశలో జి.మోహన్ ఇంటికి తూర్పు వైపు, దిలీప్‌నాయుడు జాగాకు పడమర వైపు రాజశేఖర్‌నాయుడు జాగాకు పడమర వైపు, మేము వదిలియుండు 12 అడుగులు వెడల్పు గల రోడ్డున్ను, సదరు 12 అడుగుల రోడ్డు నుండి మేము వదిలిన తూర్పు దిశగా 18 అడుగుల రోడ్డులో మామూలు రోడ్డు హక్కున్ను.

జి.వి.సుబ్బయ్య, బి.ఎ.,బి.ఎల్., అడ్వకేట్,
డో.నెం.8-114/2, రాయల్ నగర్, ఆర్.సి.రోడ్డు, తిరుపతి. సెల్ : 94402 02564



ఘనంగా నడివీధి గంగమ్మ జాతర

చిత్తూరు కల్చరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): నగరపాలక పరిధిలోని 5వ డివిజన్ రఘురాంనగర్‌లో బుధవారం నడివీధి గంగమ్మ జాతరను స్థానికులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ అముద, చుడా చైర్మన్ కఠారి అనురాధ తదితరులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని జల ప్రవేశం నిర్వహించారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా

● డంప్‌లను పరిశీలించిన అధికారులు



శ్రీహరిపురంలో అక్రమ ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్‌ఐ

విజయపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కేవీపురం కుశస్థలి నది నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో అక్రమంగా రవాణా చేస్తూ తమిళనాడు సరిహద్దులోని మల్లారెడ్డి కండ్రిగ, శ్రీహరిపురంలో డంప్ చేసి రాత్రి సమయాల్లో తమిళనాడుకు తరలిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ట్రక్కు ఇసుక రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇసుక డంపింగ్‌పై ఆరోపణలు రావడంతో బుధవారం తహసీల్దార్ కిరణ్, ఎస్‌ఐ మహేష్‌బాబు మల్లారెడ్డి కండ్రిగ, శ్రీహరిపురంలో డంపింగ్ ప్రాంతాలను పరిశీలించారు. ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా శ్రీధర్‌బాబు

పెనుమూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ శ్రీధర్‌బాబును నియమిస్తూ డీసీహెచ్‌ఎస్ పద్మాంజలిదేవి బుధవారం జీవో విడుదల చేశారు. ఈ మేరకు ఇప్పుడున్న మెడికల్ ఆఫీసర్ గీతాకుమారి ఆయనకు బాధ్యతలు అప్పగించాలని పేర్కొన్నారు. ఇది వరకే సీహెచ్‌సీలో డాక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీధర్‌కు వైద్యాధికారిగా బాధ్యతలు అప్పగించడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని ఆయన అన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

పెనుమూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఎంఈవోలు రాజేంద్ర, భాస్కర్ నాయుడు అన్నారు. బుధవారం పెనుమూరు ఎమ్మార్సీలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ప్రతీ గ్రామంలో ఉన్న డ్రాపౌట్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా వారికి సమాచారం అందించాలని వారు తెలిపారు. అనంతరం బస్టాండులో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

'మా బడి స్థాయి తగ్గించొద్దు'



యనమలమందలో విద్యార్థుల నిరసన

వెదురుకుప్పం, జూలై 23(ఆంధ్రజ్యోతి): మాబడి స్థాయి తగ్గించొద్దంటూ బుధవారం వెదురుకుప్పం మండలం యనమలమంద పాఠశాల విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. యనమలమంద మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను స్థాయి తగ్గిచ్చి ప్రాథమిక పాఠశాలగా మార్పు చేశారు. 6,7,8 తరగతులను ఇదే మండలంలోని ఆళ్లమడుగు జడ్పీ ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. అయితే తమ పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలగానే కొనసాగించాలంటూ బుధవారం ఆ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు యనమలమందలో నిరసనకు దిగారు.

తాగునీటి బోరు మంజూరు చేయించండి

గుడిపాల, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొన్ని పంచాయతీల్లో తాగునీటి బోర్లు లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని, కొత్త బోర్లు మంజూరు చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శిరీషను కోరారు. చిత్తపారకు వెంటనే బోరు మంజూరు చేయించాలని ఆయన కోరగా, స్పందించిన ఎంపీడీవో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గోవింద్‌గౌడ్ పాల్గొన్నారు.


చెట్టు కొమ్మల తొలగింపు



వేప చెట్టు కొమ్మలను తొలగిస్తున్న నగరపాలక సిబ్బంది

చిత్తూరు సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకరంగా ఉన్న వేపచెట్టు కొమ్మలను బుధవారం నగరపాలక, విద్యుత్ శాఖ సిబ్బంది సంయుక్తంగా తొలగించారు. స్థానిక మిట్టూరులోని శ్రీదుర్గా హోటల్ ఎదురుగా సుమారు 50 ఏళ్లకు పైబడిన వేపచెట్టు ఉంది. ఈ చెట్టు చుట్టూ వాణిజ్య సముదాయాలు, బ్యాంకులు తదితరాలు ఉండడంతో నిత్యం ప్రజలతో రద్దీగా ఉంటుంది. మరోవేపు చెట్టుకింద నీడకోసం ప్రజలు నిలబడుతుంటారు, ద్విచక్రవాహనాలు, కార్లు ఇక్కడ పార్కింగ్ చేస్తుంటారు. చెట్టు రోడ్డు వైపు వాలి, కొమ్మలు ఏపుగా పెరగడంతో ప్రమాదకరంగా ఉంది. చెట్టు మొదలులో పెద్ద రంధ్రం ఏర్పడింది. ఇటీవల ఈదురు గాలులకు ఒక పెద్ద కొమ్మ విరిగిపడింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రమాదకరంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించాలని స్థానికులు కలెక్టర్, నగరపాలక సంస్థ అధికారులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు బుధవారం నగరపాలక సంస్థ సిబ్బంది చెట్టు కొమ్మలను పాక్షికంగా తొలగించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

బదిలీపై వెళ్లిన అధ్యాపకులకు సన్మానం



బదిలీపై వెళుతున్న ఉద్యోగులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

పాలసముద్రం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులుగా పని చేసిన వినాయకం, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాలసుబ్రహ్మణ్యంరాజు, గుమస్తా రాజేష్‌లను బుధవారం కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ హేమలత ఆధ్వర్యంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. అధ్యాపకులు రమ్య, సుశీల, విద్యార్థులు పాల్గొన్నారు.

26న దుకాణాలకు వేలం

చిత్తూరు కల్చరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండ రామాలయం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న దుకాణాలకు ఈనెల 26వ తేదీన బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో సుబ్రమణ్యం నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాములగుడి వీధిలోని 5 దుకాణాలకు, పిళ్లారి గుడివీధిలోని మరో రెండు దుకాణాలకు మూడు సంవత్సరాల అద్దెకు బహిరంగ వేలం పాటలు నిర్వహించి, హెచ్చు పాటదారుడికి దేవదాయ శాఖ నిబంధనల మేర కేటాయించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



గుండ్రాజుకుప్పం మారుతీనగర్‌లో సీసీ రోడ్డు వేయకముందు, వేసిన తర్వాత



గుండ్రాజుకుప్పం ఎంపీపీ పాఠశాల రోడ్డు వేయక ముందు, వేసిన తర్వాత

గ్రామీణ ప్రాంతాల రోడ్లకు మహర్దశ

● రూ.82.9 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

నగరి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల రోడ్లకు మహర్దశ వచ్చింది. నియోజకవర్గంలోని నగరి, నిండ్ర, విజయపురం మండలాల్లో 214 సిమెంటు రోడ్లకు గాను రూ.8.29 కోట్ల లక్షల అంచనా వ్యయంతో సిమెంటురోడ్లు ప్రభుత్వం వేసింది. ఉపాధిహామీ పథకంలో గ్రామీణ రోడ్లు బాగుపడ్డాయని పలు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నగరి మండల పరిధిలోని 21 పంచాయతీల్లో 76 పనులకు గాను రూ.2.94 కోట్లు, నిండ్ర మండలంలో 21 పంచాయతీల్లో 75 పనులకు గాను రూ.3.21 కోట్లు, విజయపురం మండలంలో 25 పంచాయతీల్లో 63 పనులకుగాను రూ.2.14 కోట్ల అంచనా వ్యయంతో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మారుమూల రోడ్లు సైతం సీసీ రోడ్లు కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణల పరిశీలన



ఆక్రమణలపై డీపీవో సుధాకరరావుకు వివరిస్తున్న కన్నయ్య నాయుడు

గంగాధరనెల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు (ఎగవూరు)లో కొంత మంది సిమెంట్‌రోడ్డును, డ్రైనేజి కాల్వను సైతం ఆక్రమించేసి అక్రమంగా భవనాలు నిర్మించారని, వారిపై చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ ఉద్యోగుల యూనియన్ నేతలు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఇటీవల పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీవో సుధాకరరావు బుధవారం గంగాధరనెల్లూరు (ఎగవూరు)లో అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పుత్తూరు మెయిన్‌రోడ్డు గ్రామీణబ్యాంక్ వీధి ప్రారంభం నుంచి సత్యమ్మ గుడివరకు సిమెంట్‌రోడ్డును, డ్రైనేజి కాల్వపైన పక్కాభవనాలు వగైరా నిర్మించేశారని, దీంతో సిమెంట్‌రోడ్డుపై స్కూలువ్యాన్లు, ఇతర వాహనాలు ఎదురెదురుగా దాటుకోలేని పరిస్థితి నెలకొందని రిటైర్డ్ ఉద్యోగుల యూనియన్‌నేత కన్నయ్య నాయుడు డీపీవోకు వివరించారు. అనంతరం డీపీవో మాట్లాడుతూ తాను పరిశీలించిన మేరకు గుంతల పడిన సిమెంట్‌రోడ్డుకు మరమ్మతులు చేసి, డ్రైనేజి కాల్వపై బండలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆక్రమణలపై కలెక్టర్‌కు నివేదిక ఇస్తానని చెప్పారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శి శివయ్య, సచివాలయ సర్వేయర్ వాసు, వీఆర్వో రాధిక, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సునీల్ కుమార్, రిటైర్డ్ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ పకడ్బందీగా నిర్వహించాలి



టీకేఎంపేటలో చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు

వెదురుకుప్పం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో చెత్త సేకరణను పకడ్బందీగా పంచాయతీ కార్యదర్శులు నిర్వహించాలని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు ఆదేశించారు. బుధవారం కార్వేటినగరం మండలం టీకేఎంపేట పంచాయతీలో ఐవీఆర్ఎస్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఐవీఆర్ఎస్ కార్యక్రమం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో చెత్తసేకరణలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత కార్యదర్శిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్వేటినగరం ఎంపీడీవో చంద్రమౌళి, డిప్యూటీ ఎంపీడీవో బీవీ మధుసూదన్, పంచాయతీ కార్యదర్శి పూర్ణిమ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మామిడి చెట్ల నరికి వేత



మామిడి చెట్టును నరికివేసిన దృశ్యం

శ్రీరంగరాజపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): కక్ష సాధింపుతో మామిడి చెట్లు నరికివేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు... ఎస్ఆర్‌పురం మండలం యు.ఎం.పురం గ్రామానికి చెందిన అబ్బయ్య అనే రైతు ఎస్ఆర్‌పురం రెవెన్యూ, సర్వే నెంబరు 236/2లోని ఎకరా పొలంలో 50 మామిడి చెట్లు నాటాడు. ఆ చెట్లను అదే గ్రామానికి చెందిన సురేంద్ర, మరి కొంత మంది కలిసి మంగళవారం రాత్రి నరికి వేశారని బుధవారం బాధితుడి కుమారుడు మండల రెవెన్యూ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తమ గ్రామానికి చెందిన వ్యక్తులు కక్ష సాధింపుతో తమ పొలంలో ఉన్న మామిడి చెట్లు నరికేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు వాపోయాడు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం

వెదురుకుప్పం, జూలై 23(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ఆర్కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ బెటాలియన్‌ను ప్రారంభించినట్లు ఇన్‌చార్జి హెచ్ఎం ఉమాశంకర్ బుధవారం తెలిపారు. ఉమాశంకర్ మాట్లాడుతూ విద్యార్థులను పరీక్షించి పది మంది అమ్మాయిలను, 15 మంది అబ్బాయిలను ఎంపిక చేసినట్లు చెప్పారు. వీరికి కేర్ టేకర్‌గా హిందీ ఉపాధ్యాయుడు తారకరామ వ్యవహరిస్తారని చెప్పారు. ఎన్‌సీసీ గురించి విద్యార్థులకు వివరించారు.

విద్యార్థులకు కంటిపరీక్షలు

నగరి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నగరి మండలంలోని ఎం.కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందించడంతో బాటు కంటి అద్దాలు అవసరమైన వారిని గుర్తించి వారికి సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గీతాకుమార్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునిరత్నం, వైద్యులు, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లర్క్ భార్యకు ఆర్థికసాయం



ప్రసన్నకుమారికి చెక్కు అందిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో క్లర్క్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన దయాసాగర్ భార్యకు ప్రభుత్వం తరఫున ఎస్పీ మణికంఠ ఆర్థికసాయాన్ని అందించారు. క్లర్క్‌గా పనిచేస్తున్న దయాసాగర్ ఈ నెల 7వ తేదీన మరణించారు. మృతుడి భార్య ప్రసన్న కుమారికి ప్రభుత్వం తరఫున ఐడీఆర్ఎఫ్ నుంచి రూ.1 లక్ష చెక్కును ఎస్పీ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖ తరఫున అందాల్సిన సంక్షేమ పథకాలన్నీ సకాలంలో అందేవిధంగా చూస్తామని భరోసా ఇచ్చారు.

'ఈ' పంట నమోదు చేసుకోవాలి

వెదురుకుప్పం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ ఈ పంట కార్యక్రమంలో పంటలను నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ ఉమా, జిల్లా వనరులశాఖ ఏడీఏ నాగపద్మిని, వ్యవసాయాధికారి వనిత తెలిపారు. బుధవారం వెదురుకుప్పం మండలం మారేపల్లిలో రైతులకు పెరటి తోటల పెంపకం, నానో యూరియాపై అవగాహన కల్పించారు. కూరగాయల విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. రైతులకు అవసరమైన సూచనలు, సలహాలను ఇచ్చారు. సర్పంచ్ అన్నురాశి పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

నిండ్ర, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ప్రజల చేతుల్లో పాశుపతాస్త్రం వంటిదని తహసీల్దార్ శేషగిరిరావు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, కార్యదర్శులతో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకతను పెంచడానికి, అవినీతి నియంత్రణకు సమాచార హక్కు చట్టం వచ్చిందని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ, వివిధ మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

చిత్తూరు ఎమ్మెల్యే నివాసానికి కర్ణాటక ఎమ్మెల్యేలు



ఎమ్మెల్యే అశోక్‌తో జగన్మోహన్, హేమలత, అముద తదితరులు

చిత్తూరు సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నివాసానికి కర్ణాటక శాసనసభా పక్షనేత, బీజేపీ ఎమ్మెల్యే ఆర్.అశోక్, దొడ్డబల్లాపుర ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్ బుధవారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి సాదర స్వాగతం పలికి దుశ్శాలువ, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. అనంతరం స్థానిక టీడీపీ నేతలను వారికి పరిచయం చేశారు. కార్యక్రమంలో చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమ నాయుడికి సన్మానం



కృష్ణమ నాయుడిని సన్మానిస్తున్న యుగంధర్ తదితరులు

గంగాధరనెల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియామకమైన ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడిని బుధవారం పలువురు జనసేన నేతలు, జిల్లా సింగిల్ విండో సొసైటీ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు వేర్వేరుగా శాలువాలు కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ జనసేన కన్వీనర్ యుగంధర్, జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, జిల్లా తెలుగునాడు సింగిల్ విండో సొసైటీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, జాయింట్ కార్యదర్శి మురుగన్, నేతలు బాబునాయుడు, సురేష్‌రెడ్డి, చిరంజీవి, శోభన్‌బాబు, లతీష్, శ్రీలతారెడ్డి, మహేష్, చందు, పవన్, రాఘవ, చార్లీష్ పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే



చిత్తూరు సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడిని మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం స్పీకర్ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడానికి తిరుపతి వచ్చారు. అలాగే చంద్రగిరి కోట సందర్శనానికి విచ్చేసిన స్పీకర్‌ను ఏఎస్ మనోహర్ కలిశారు.

నీతి పద్యాల పుస్తకావిష్కరణ

చిత్తూరు కల్చరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నగరపాలక పరిధిలోని ఎం.బండపల్లె ఉన్నతపాఠశాలలో తెలుగు సాహితీ సాంస్కృతిక సమితి అధ్యక్షులు రచించిన నీతి పద్యాల పుస్తకావిష్కరణ పాఠశాల విద్యార్థులచే ఘనంగా జరిగింది. గ్రంథ రచయిత తులసీనాథం నాయుడు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రోజుకొక పద్యం అభ్యాసం చేస్తే జ్ఞానవంతులు అవుతారన్నారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

నిరాశ్రయులకు చీరల పంపిణీ

చిత్తూరు రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని గంగనపల్లిలోని నిరాశ్రయుల వసతిగృహంలో వృద్ధులకు నగరానికి చెందిన మాజీ కౌన్సిలర్ పార్థసారథి నాయుడు బుధవారం చీరలు పంపిణీ చేశారు. వసతిగృహంలో అన్నదానం చేసేందుకు వెళ్లగా అక్కడ వారి పరిస్థితి చూసి చలించిపోయానని, వెంటనే చీరలు తెప్పించి వారికి పంపిణీ చేసినట్లు ఆయన చెప్పారు. నగరవాసులు, దాతలు నిరాశ్రయులను ఆదుకోవాలని కోరారు.

షిరిడీలో భజనలు



షిరిడీలో అభయసాయి ట్రస్టు సభ్యులు

పూతలపట్టు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని షిరిడీ సాయిబాబా ఆలయానికి శ్రీఅభయసాయి ట్రస్టు ఆధ్వర్యంలో సుమారు 534 మంది భక్తులు గత ఆదివారం వెళ్లారు. ఇందులో భాగంగా ఆలయం వద్ద చెక్కభజనలతో పాటు పలురకాల భజనలు చేశారు. ఆంధ్రరాష్ట్రం నుంచి నిర్వహించిన చెక్క భజనను చూసిన మహారాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం భక్తులు ఆలయం వద్దకు ఊరేగింపుగా భజనలు చేస్తూ వెళ్లి బాబాను దర్శించుకున్నారు. ట్రస్టు వ్యవస్థాపకులు రామమూర్తిరెడ్డి, ఆయన సతీమణి రేణుక, లోకేష్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, రామమూర్తిరెడ్డి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ అభివృద్ధికి కృషి చేయాలి



బాలాజీని సన్మానిస్తున్న చినబాబు

నగరి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పీఏసీఎస్‌కు నూతనంగా ఎంపికైన చైర్మన్ బాలాజీని బుధవారం చైర్మన్ చాంబర్‌లో చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సురేష్ నాయుడు ఘనంగా సన్మానించారు. రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని, బ్యాంకుకు వచ్చిన ప్రతి రైతుకు శాయశక్తులా సహాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు జవహర్‌రెడ్డి, ఐవీ నాయుడు, కుమార్ నాయుడు, వేణు, హరిబాబు, అగరం పీఏసీఎస్ చైర్మన్ బాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.